



తెనాలిలో అభిమానులు, కార్యకర్తలకు అభివాదం తెలుపుతున్న పవన్‌కళ్యాణ్, పెమ్మసాని, మనోహర్

బస్సెక్కిన అభిమానం





● గజమాలతో అభిమానుల సత్కారం



తెనాలి మార్కెట్ సెంటర్‌లో సభకు హాజరైన అశేష జనవాహిని

జగన్‌ను తరమికొట్టాలి

ప్రజల కోసం.. వారి శ్రేయస్సు కోసం.. రాష్ట్రం కోసం.. అమరావతి రాజధాని అభివృద్ధి కోసం.. అందరికీ అన్నం పెట్టే రైతుల శ్రేయస్సు కోసం.. నిరుద్యోగులు, కార్మికుల కష్టాలు తీర్చడం కోసం, ప్రజలందరికీ మంచి జరిగేలా సైకో ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు పవన్‌కల్యాణ్ అనే నేను జనసేన పార్టీని స్థాపించి మీ ముందుకు వచ్చాను. సైనికుడిలా ప్రభుత్వంపై పోరాడుతున్నాను.. నా పోరాటానికి మీరంతా మద్దతుగా నిలిచారు.. మీ కోసం వచ్చా.. మార్పు కోసం ప్రయత్నిస్తున్నా.. రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకోవాలి. పేదల పక్షపాతులమంటూ వారిపైనే పెత్తందారులుగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నారు. పేదల సంక్షేమం పేరుతో కోటాను కోట్లు దోచేసిన వైసీపీ జగన్ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరమికొట్టాలి.

పవనాభిమానం

తెనాలిలో ప్రభంజనం

- జనసేనానికి అపూర్వ స్వాగతం
- వారాహి విజయభేరికి జననీరాజనం
- రెండు కిలోమీటర్ల దూరానికి 2 గంటలు
- భారీ గజమాలలతో అభిమానుల సత్కారం



రోడ్‌షోలో పాల్గొన్న జనసేన, టీడీపీ, బీజేపీ అభిమానులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 14: పవనాభిమానం పోటెత్తింది.. జనసేనానికి తెనాలి నీరాజనం పలికింది. తొలిసారి తెనాలి పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అభిమానులు గజమాలలతో స్వాగతం పలకగా.. మహిళలు హారతులు పట్టి దిష్టితీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం వారాహి విజయభేరి సభలో పాల్గొనేందుకు తెనాలి వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో సుల్తానాబాద్‌లో దిగారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వారాహి వాహనంపై సుల్తానాబాద్, చెంచుపేట, మారీస్‌పేట మీదగా మహాత్మాగాంధీ మార్కెట్ కూడలి వరకు రోడ్ షో నిర్వహించారు. ఆయన వెంట పెద్దసంఖ్యలో అభిమానులు ద్విచక్రవాహనాలతో ర్యాలీగా పాల్గొన్నారు. దారిపొడవునా జనం నీరాజనం పట్టారు. కేవలం 2 కి.మీటర్ల దూరం రోడ్ షోకు రెండున్నర గంటలకుపైగా సమయం పట్టింది. అంగలకుదురు గణేష్ యూత్ నాయకుడు వీరవల్లి మురళి బృందం ఎక్స్‌కవేటర్ల సాయంతో భారీ గజమాలతో పవన్ కల్యాణతో పాటు, లోక్‌సభ, అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లను సత్కరించారు. దారిపొడవునా డివైడర్లపైన, భవనాలపైన జనం కిక్కిరిసి పోయారు. వారందరికీ పవన్ వారాహిపై నుంచి విజయకేతనం చూపుతూ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



రైతుల సమస్యలు వింటూ...

మార్కెట్ సెంటర్‌కు పోటెత్తిన జనం

మార్కెట్ సెంటర్‌లో సాయంత్రం 6 గంటలకు పవన్‌కల్యాణ్ వారాహిపై నుంచి ప్రసంగిస్తారని జనసేన నేతలు ప్రకటించారు. దీంతో సాయంత్రం 4 గంటలకే పెద్దసంఖ్యలో అక్కడకు జనం భారీగా చేరుకున్నారు. ఆయన సభ మొదలయ్యే సమయానికి సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. చాలావరకు గుంటూరు, విజయవాడ ప్రధాన రహదారులపైనే జనం నిరీక్షించాల్సి వచ్చింది. భారీ సంఖ్యలో జనాన్ని చూసిన పవన్‌కల్యాణ్ ఉత్సాహంతో ప్రసంగాన్ని పరుగులు పెట్టించారు. మహిళలు, యువత, ఉద్యోగుల సమస్యలపై జనసేనాని ప్రసంగించేటప్పుడు జనం నుంచి భారీగా స్పందన వచ్చింది. పార్టీకి చిరంజీవి రూ.5 కోట్లు విరాళం ఇవ్వడంతో పాటు రామ్‌చరణ్‌ను కూడా విరాళం ఇవ్వాలని చెప్పారని, ఆయనకు తెనాలి వేదికగా కృతజ్ఞతలు చెబుతున్నట్లు ప్రకటించటంతో జనం నుంచి కేరింతలు వినిపించాయి. అంతకముందు హెలిప్యాడ్ వద్ద పవన్‌కు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్,మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



అభిమానులతో సెల్ఫీ

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

- రాజ్యాంగ నిర్మాతకు కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందు మాధవ్ నివాళి

నరసరావుపేట రూరల్, నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 14: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ శివశంకర్ పిలుపిచ్చారు. కలెక్టరేట్‌లోని డా.బీఆర్‌అంబేద్కర్ స్పందన హాల్ లో



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి అధికారులతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర మరువరాని దన్నా రు. దేశభక్తి, మానవతా విలువలు కలిగిన అంబే ద్కర్ గొప్ప దార్శినికుడన్నారు. అంబేద్కర్ స్ఫూర్తి తో ప్రతి ఒక్కరూ విద్యావంతులై అభివృద్ధి చెందా లన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారందరూ ఓటు వినియోగించుకోవాలని తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధిని కాంక్షిస్తూ అంబేద్కర్ అందరికీ ఆదర్శ ప్రాయంగా నిలిచారన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ఎస్పీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు, డీఎస్పీ గాంధీరెడ్డి, ఇతర అధికారులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప విద్యావేత్త, మహా జ్ఞాని, న్యాయవాది, సంఘ సంస్కర్త అని తెలిపారు. రాజ్యాంగ ఫలాలు ప్రతిఒక్కరికీ అందాలని ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించారన్నారు. అంటరానితనం, వివక్ష నిర్మూలించాలని, అలుపెరగని కృషి చేసిన కృషీవలుడన్నారు. ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్, అధికారులు

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు

- నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఆందోళనలు
- ప్రేక్షకపాత్రకే పరిమితమైన ఎన్నికల అధికారులు

నరసరావుపేట, ఏప్రిల్ 14: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రాజకీయ నేతల కార్యక్రమాలకు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. అయితే నరసరావుపేటలో వైసీపీ నేతలు ఎన్నికల నియమావళిని పట్టించుకోవడంలేదు. వైసీపీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకుండా అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఆదివారం నరసరావుపేట, రొంపిచర్లలో వైసీపీ నాయకులు ఆందోళనలు నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిపై జరిగిన దాడికి చంద్రబాబే కారణమని ఆరోపిస్తూ పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబుకు వ్యతిరేకంగా వైసీపీ శ్రేణులు నినాదాలు చేశాయి. ఎటువంటి అనుమతులు లేకుండా వైసీపీ నాయకులు ఆందోళనలు నిర్వహించినా ఎన్నికల నియామళి అమలు చేసే అధికారులు ప్రేక్షకపాత్ర వహించారన్న విమర్శలు నెలకొన్నాయి. రొంపిచర్లలో వైసీపీ శ్రేణులు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనను అడ్డుకుని కొందరు వైసీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే నరసరావుపేట పట్టణంలో మాత్రం వైసీపీ నేతలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా అధికారులు స్పందించకపోవడం గమనార్హం.



నరసరావుపేటలోని గడియార స్తంభం సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, వైసీపీ నేతలు

జంట నగరాల నుంచి తరలిరానున్న ఓటర్లు

● మే 10, 11, 12 తేదీల్లో రైళ్లలో బుకింగ్ అయిపోయిన టిక్కెట్లు

7లో..

కొమ్మాలపాటి శ్రీధర్‌కు పల్నాడు జిల్లా పగ్గాలు



దిక్సూచి
DIKSUCHI

గుప్తుల కాలంలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు

ఇండియన్ హిస్టరీ

భారతదేశ చరిత్రలో గుప్తుల కాలాన్ని పరిశీలించే క్రమంలో ఆనాటి సామాజిక, ఆర్థిక తదితర పరిణామాలను తరచి చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు వీటిని మరింత లోతుగా తెలుసుకోవాలి.

గుప్తుల కాలం నాటి సమాజంలో నాలుగు వర్ణాలతో పాటు 'చండాలులు' అనే పంచమ వర్ణం ఏర్పడింది. దీనిని ఫాహియాన్ 'అంటరాని వర్ణం'గా పేర్కొన్నాడు. వర్ణాశ్రమ ధర్మాలు ఉండేవి. అయినప్పటికీ 'వర్ణ సంకర' విధానం కొనసాగింది. వర్ణాశ్రమ ధర్మం కాపాడటానికి 'అభయదత్తుడు' అనే ఉద్యోగిని రాజు నియమించాడు. శాతవాహనుల మాదిరిగానే వీరు కూడా బ్రాహ్మణులకు అగ్రహారాలు(గ్రామాలు) దానంగా ఇచ్చేవారు.

గుప్తుల కాలంలో స్త్రీ స్వేచ్ఛ తగ్గిపోయింది. సతీసహగమనం, బాల్య వివాహాలు, బహుభార్యత్వం వంటి అనాచారాలు కొనసాగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహాలు ఉండేవి. పురుషులు అధిక వర్ణం స్త్రీలను వివాహాలు చేసుకోవడాన్ని ధర్మశాస్త్రాలు నిషేధించాయి. క్రీ.శ.510లో 'ఎరాన్' శాసనాన్ని భానుగుప్తుడు చెక్కించాడు. దీనిలో సతీసహగమనం, దేవదాసీ ఆచారం ఉన్నట్లు రాసి ఉంది. సమాజంలో శెట్టిలు(వ్యాపారులు), జితిక అనే వృత్తిపనివారు ఉన్నారని 'భితారి' శాసనంలో రాశారు. సేద్య బానిసలు, జాజ్‌మని అనే వ్యవస్థకు గుప్తుల కాలంలోనే పునాది పడింది. ఈ వ్యవస్థకు గల కారణాలు 'ఇండోర్' శాసనంలో ఉన్నాయి.

నలంద విశ్వవిద్యాలయం

దీనిని కుమారగుప్తుడు నిర్మించాడు. తరవాత పుష్యభూపతి వంశంలో హర్షుడు ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేశాడు. ఆ తరవాత పాలరాజులకు చెందిన ధర్మపాలుడు కూడా ఈ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేశాడు.



సంస్కృతంలో 'నలం' అంటే జ్ఞానం లేదా పద్మం అని, 'ద' అంటే ఇవ్వడం అని అర్థం. నలంద విశ్వవిద్యాలయంలో మూడు గొప్ప గ్రంథాలయాలు ఉన్నాయి. వీటికి తురుష్కరాజులు సహాయం చేశారు. 12వ శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ చేతిలో ఈ విశ్వవిద్యాలయం పతనం చెందింది.

ఆర్థిక విధానం

భూములను సామంతులకు, ఉద్యోగులకు, బ్రాహ్మణులకు దానాలుగా ఇవ్వడం వల్ల రాజుకు భూమిపై అధికారం తగ్గింది. రాజుకు, సాగుచేసే సామాన్య రైతుకు మధ్య అనేక మంది మధ్యవర్తులు ఉండటంతో ఫలితాన్ని అనుభవించే భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. ఈ భూస్వామ్య వ్యవస్థ గురించి 'భితారి' శాసనంలో రాశారు. 'సార్థవాహనులు' అనే సంచార వర్తకులు కూడా నగరాల్లో ఎక్కువగా ఉండేవారు. రైతులపై హిరణ్య(నగదు పన్ను); కొనుగోలు మీద వేసే క్లిప్త, ఉపక్లిప్త పన్నులు; అమ్మకపు పన్ను; వ్యవసాయానికి వాడుకునే నీటిపై వేసే వత భూత పన్ను గుప్తుల కాలంలో విధించేవారు.

భూ విభజన: భూములను ఖిల్ల(వ్యవసాయ), క్షేత్ర(నివాస), స్థల(అటవీ) అని మూడు రకాలుగా విభజించారు.

నాణేలు: కంస, సిక్క

విదేశీ వాణిజ్యం: గుప్తులు ఎక్కువగా ఆగ్నేయాసియా దేశాలతో వర్తక వాణిజ్యాలు నిర్వహించేవారు. అరికమేడు, ముజ్రిస్, కావేరి రేవు పట్టణాలు ప్రసిద్ధి. పర్షియా, అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి గుర్రాలను దిగుమతి చేసుకునే వారు.



మత విధానం

వైదిక మతం పునరుద్ధరించారు. క్రతువులు, యజ్ఞయాగాలు పెరిగాయి. వేదాలు వినడం, ఇతిహాసాలు చదవడానికి శూద్రులకు అవకాశం కల్పించారు. దశావతారాలు, త్రిమూర్తులను నాటి ప్రజలు పూజించేవారు. బౌద్ధ, జైన మత సూత్రాలను హిందూ మతం గ్రహించింది. శైవ మతానికి ఆదరణ పెరిగింది. మూఢ నమ్మకాలు కూడా పెరిగాయి. విగ్రహారాధన స్థిరపడింది.

వైష్ణవం: ఈ మతంలో నూతన శాఖలు ఏర్పడ్డాయి. పంచరాత్రి, వైఘానస మొదలైన శాఖలు ఏర్పడ్డాయి. రెండో చంద్రగుప్తుడు పరమ భాగవతుడని పేరు పొందాడు.

శైవం: శైవంలో తాంత్రిక శాఖలు, భక్తి శాఖలు ఏర్పడ్డాయి. వీటిని కాపాలిక, కాలాముఖ శాఖలు అనేవారు. మితవాద శాఖలు కూడా ఉండేవి. శివున్ని లింగ రూపంలో పూజించడం ప్రారంభించారు. ఇది మొదట కశ్మీర్‌లో ప్రారంభమైంది. అభినవ గుప్తుడు త్రిక అనే శాఖను ప్రారంభించాడు. వసుగుప్తుడు ప్రత్యాబిజ్ఞా అనే శైవ శాఖను ప్రారంభించాడు.

జైన మతం: అనేక జైన స్థావరాలు నిర్మించారు. గుజరాత్‌లో జైనమతం అభివృద్ధి చెందింది.

బౌద్ధ మతం: అనేక ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు నిర్మించారు. బుద్ధగయలో బౌద్ధ విహారం నిర్మించడానికి శ్రీలంక రాజు మేఘవర్ణుడికి సముద్రగుప్తుడు అనుమతించి పరమత సహనం చాటాడు. మథుర, సార్‌నాథ్, కోశాంబి మొదలైనవి బౌద్ధ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. అసంగుడు, పరమార్థుడు, దిగ్నాగుడు ఈ కాలపు గొప్ప బౌద్ధ పండితులు.

గుప్తుల పరమత సహనం: గుప్తులు హిందూ మతాభిమానులైనా..పరమత సహనం చూపారు. బౌద్ధ, జైనులకు పదవులు ఇచ్చారు. దానాలు చేశారు. విరాళాలు ఇచ్చారు. రెండో చంద్రగుప్తుని సేనాని 'అమరక దేవుడు' బౌద్ధుడు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

సాహిత్యం

గుప్తుల కాలం సాహిత్యానికి స్వర్ణయుగం అని చెప్పవచ్చు. సముద్రగుప్తుడు స్వయంగా కవి. అతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉండేది. రెండో చంద్రగుప్తుని కాలంలో 'నవరత్నాలు' అని పేరుపొందిన కవులు ఉండేవారు. వారిలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కాళిదాసు ఒకరు. ఈయన రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం' గ్రంథాన్ని సర్ విలియం జోన్స్ ఆంగ్లంలోకి అనువదించాడు. 'మాళవికాగ్నిమిత్రం' నాటకంలో ఉజ్జయని రాకుమార్తె మాళివికను మగధ యువరాజు అగ్నిమిత్రుడు చేసుకున్న వివాహం(రాక్షస వివాహం) గురించి కాళిదాసు అద్భుతంగా రాశాడు.

గుప్తుల కాలంలో కొనసాగిన సాహిత్య సేవను చరిత్రకారులు గ్రీస్‌లోని పెరిక్లస్ యుగంతో, రోమ్‌లోని అగస్టస్ యుగంతో, ఇంగ్లాండ్‌లోని ఎలిజబెత్ యుగంతో పోల్చారు. గుప్త రాజులు సంస్కృత, సాహిత్య రంగాల్లో చేసిన సేవల వల్లనే వారి యుగానికి స్వర్ణయుగం అనే పేరు వచ్చింది. గుప్త చక్రవర్తులు స్వయంగా పండితులు. అలహాబాద్ ప్రశస్తి శాసనంలో కావ్యశైలిలో హరసేనుడు అద్భుతంగా రాశాడు.

నవరత్నాలలో ఒకడైన కాళిదాసు రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం అనే కావ్యాలు రాశాడు. అదేవిధంగా ఇతర కవుల గ్రంథాలు... శూద్రకుడు - మృచ్ఛకటికం; విశాఖదత్తుడు- ముద్రా రాక్షసం, దేవీచాంద్రగుప్తం; భానుడు- వాసవదత్త, విష్ణుశర్మ- పంచతంత్రం మొదలైనవి. అమరసింహుడు 'అమరకోశం' అనే వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. కామాంధకుడు 'నీతి శాస్త్రం' రచించాడు. ఇది గుప్తుల కాలంలో వచ్చిన రాజకీయ గ్రంథం. మౌర్యుల అర్థ శాస్త్రంతో పోల్చదగినది.

వేదాంత శాస్త్రాలు: ఈ కాలంలో అద్భుతమైన గ్రంథాలు వచ్చాయి. అసంగుడు బౌద్ధ గ్రంథాలపై వ్యాఖ్యానాలు రాయగా, దిగ్నాగుడు ప్రమాణచముచ్చేయం రాసి తర్కశాస్త్ర పితగా ప్రసిద్ధి చెందాడు. అష్టాదశ పురాణాలను ఈ కాలంలోనే రాశారు. మనుధర్మశాస్త్రం, యజ్ఞవల్క్యస్మృతి మొదలైనవి ఈ కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

విజ్ఞానశాస్త్ర గ్రంథాలు: గుప్తుల కాలంలో సాహిత్యంతోపాటు విజ్ఞాన శాస్త్రం కూడా అభివృద్ధి చెందింది. గణిత, ఖగోళ, భౌతిక, వైద్యశాస్త్రాలు అభివృద్ధి చెందాయి. దశాంశ పద్ధతి, సున్నా విలువలు వాడుకలోకి వచ్చాయి. రెండో చంద్రగుప్తుడు ఉజ్జయినిలో నక్షత్రశాలను నెలకొల్పాడు. మెహరోలిలో నక్షత్రాల పరిశీలన కోసం వరహమిహిరుడికి రెండో చంద్రగుప్తుడు ఎత్తయిన ఇనుప స్తంభం నిర్మించి ఇచ్చాడు. రోమక, జాతక, లఘు అనే గణితశాస్త్ర గ్రంథాలను వరహమిహిరుడు రాశాడు. అదేవిధంగా బృహత్‌సంహిత గ్రంథంలో భూగోళ, ఖగోళ, జ్యోతిష, వృక్ష శాస్త్రాల గురించి రాశాడు. ఆర్యబట్టీయం, సూర సిద్ధాంతాలను ఆర్యబట్టు రచించాడు. వీటిలో సూర్య, చంద్ర గ్రహణాల గురించి వివరించాడు. వాగ్భటుడు వైద్యంలో అష్టాంగ సంగ్రహం అనే గ్రంథం రాశాడు. పాలకశ్యపుడు హస్తాయుర్వేదంలో పశు వైద్యం గురించి రాశాడు. ధన్వంతరి, శుశ్రుతుడు గుప్తుల కాలంలో గొప్ప వైద్యులు.

డాక్టర్ ఐ. నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.



కోడింగ్ - డీకోడింగ్

రీజనింగ్

పోటీపరీక్షల ప్రత్యేకం

పార్ట్-3

1. ఒక కోడ్ భాషలో MERITను 7, 18, 9, 22, 14గా రాశారు. అదే కోడ్ భాషలో PONDSను ఏ విధంగా రాస్తారు?

ఎ) 11, 12, 23, 13, 8 బి) 11, 13, 12, 8, 23
సి) 8, 23, 13, 12, 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: MERIT అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా M అనగా 14వ అక్షరం, E అనగా 22, R అనగా 9, I అనగా 18, T అనగా 7. ఈ సంఖ్యలను రివర్స్ చేయగా 7, 18, 9, 22, 14. ఇదే విధంగా PONDS అనే పదాల్లోని అక్షరాలకు అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా P అనగా 11, O అనగా 12, N అనగా 13, D అనగా 23, S అనగా 8. కావున 8, 23, 13, 12, 11 అనగా 'సి' సమాధానం అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో LUNCHను 58గా రాశారు. అదే కోడ్ భాషలో FRUITను ఏ విధంగా రాస్తారు?

ఎ) 74 బి) 68 సి) 72 డి) ఏదీకాదు

సమాధానం:(ఎ)

వివరణ: LUNCH అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా L అనగా 12, U అనగా 21, N అనగా 14, C అనగా 3, H అనగా 8, 12+21+14+3+8=58. ఇదే విధంగా PONDS అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా F అనగా 6, R అనగా 18, U అనగా 21, I అనగా 9, T అనగా 20. కావున 6 +18+21 + 9 + 20=74 సమాధానం అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో BIGను 324గా రాశారు. అదే కోడ్ భాషలో ACTను ఏ విధంగా రాస్తారు?

ఎ) 576 బి) 529 సి) 676 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: BIG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 9, 7 వీటిని కూడగా 2+9+7=18. ఈ 18 వర్గం (స్క్వేర్) 324. అదే విధంగా ACT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 3, 20 వీటిని కూడగా 1+3+20=24. ఈ 24 వర్గమే (స్క్వేర్) 576.

4. ఒక కోడ్ భాషలో AIMను 251గా రాశారు. అదే కోడ్ భాషలో INKను ఏ విధంగా రాస్తారు?

ఎ) 416 బి) 398 సి) 264 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: AIM అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 9, 13. వీటి విడి విడి వర్గాలను కూడగా అనగా $1^2, 9^2, 13^2$ = 1+81+169=251 అదే విధంగా INK అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 9, 14, 11. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $9^2, 14^2, 11^2$= 81+196+121=398 సమాధానం అవుతుంది.

5. ఒక కోడ్ భాషలో HATను 160గా రాశారు. అదే కోడ్ భాషలో 'PAN'ను ఏ విధంగా రాస్తారు?

ఎ) 224 బి) 242 సి) 422 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: HAT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 8, 1, 20. వీటిని గుణించగా 8x1x20=160 అదే విధంగా PAN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 16, 1, 14 వీటిని గుణించగా 16x1x14 = 224 సమాధానం అవుతుంది.

6. ఒక కోడ్ భాషలో PLANEను 96గా రాశారు. అదే కోడ్ భాషలో SOLVEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 142 బి) 144 సి) 146 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: PLANE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు P అనగా 16, L అనగా 12, A అనగా 1, N అనగా 14 E అనగా 5 వీటిని కూడగా 16+12+1+14+5=48కి రెట్టింపు 96. అదే విధంగా SOLVE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు S అనగా 19, O అనగా 15, L అనగా 12, V అనగా 22, E అనగా 5 వీటిని కూడగా 19+15+12+22+5=73 కి రెట్టింపు 146 సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో SMART ను 128గా రాశారు. అదే కోడ్ భాషలో RANGEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 180 బి) 160 సి) 168 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: SMART అనే పదంలోని అక్షరాలకు అపసవ్య దిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా S అనగా 8, M అనగా 14, A అనగా 26, R అనగా 9, T అనగా 7. వీటిని కూడగా 8+14+26+9+7=64కి రెట్టింపు 128. ఇదేవిధంగా RANGE అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు R అనగా 9, A అనగా 26, N అనగా 13, G అనగా 20, E అనగా 22 వీటిని కూడగా 9+26+13+20+22=90 రెట్టింపు 180 సమాధానం అవుతుంది.

8. ఒక కోడ్ భాషలో LIKEను 33గా రాశారు. అదే కోడ్ భాషలో EARNను ఏ విధంగా రాస్తారు?

ఎ) 34 బి) 38 సి) 37 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: LIKE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 12+9+11+5=37. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 37 నుంచి 4 తీసివేస్తే 37-4=33. అదే విధంగా EARN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 5+1+18+14=38. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 38 నుంచి 4 తీసివేస్తే 38-4=34 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దక్షిణ భారత్‌కూ బుల్లెట్ రైలు

- 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నిర్వహిస్తాం..
- ఇంటింటికీ నీరు, పైప్‌లైన్‌తో గ్యాస్
- అన్నదాతలందరికీ డ్రోన్లు
- ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం
- బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు



బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న మోదీ, నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. మళ్లీ అధికారంలో వస్తే ఐదేళ్లలో ఏం చేస్తామో చెబుతూ.. దేశ ప్రగతి, యువత, మహిళలు, పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆ పార్టీ అగ్రనేతలు ఆవిష్కరించారు. మోదీకి గ్యారెంటీ శీర్షికతో ఉన్న ఈ మ్యానిఫెస్టోను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ఆదివారం మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ దక్షిణాదికీ బుల్లెట్ రైలు సేవలను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర, తూర్పు భారత్‌కూ బుల్లెట్ రైలు వేస్తామన్నారు. దీనిపై త్వరలో సర్వే ప్రారంభం కానుందని పేర్కొన్నారు. శరవేగంగా సాగుతున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు పనులు పూర్తయ్యే దశకు వచ్చాయని.. ఈ అనుభవంతో మిగతా మూడు ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పారు. వందే భారత్ రైలు సేవలను దేశవ్యాప్తం చేస్తామన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని తెలిపారు. ముద్ర పథకం రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ నీరు, పైప్ ద్వారా గ్యాస్ అందిస్తామని హామీ ఇచ్చారు. పీఎం సూర్య ఘర్ ద్వారా జీరో పవర్ బిల్‌ను సాకారం చేస్తామన్నారు. మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ అందిస్తామని మోదీ తెలిపారు. ఇప్పటికే 4కోట్ల ఇళ్లు కట్టించామని.. మధ్య తరగతికి మరో 3కోట్ల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు.

నాలుగు స్తంభాలతో సంకల్ప్ పత్ర

పేదలు, యువశక్తి, అన్నదాత, నారీశక్తి.. అనే నాలుగు స్తంభాలపై సంకల్ప్ పత్రకు పునాదులు వేశామని మోదీ వెల్లడించారు. పదేళ్లలో ఎంతో ప్రగతిని సాధించామని, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని అందుకే బీజేపీ మ్యానిఫెస్టో కోసం యావత్ దేశం ఎదురుచూసిందని చెప్పారు. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెంచుతామని మోదీ చెప్పారు. ప్రతి రైతు ఇంటిపై డ్రోన్లు తిరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారిన అవినీతిని అంతమొందించడానికి ఎంతో చేశామని, భవిష్యత్తులోనూ దీనిని కొనసాగిస్తామని చెప్పారు. 140 కోట్ల మంది ప్రజలను దృష్టిలో పెట్టుకుని మ్యానిఫెస్టోను తయారు చేసామని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. మోదీ గ్యారెంటీపత్రం 24 క్యారెట్ల బంగారంతో సమానమన్నారు. మోదీ గ్యారెంటీ, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాలుగా పేర్కొన్న బీజేపీ మ్యానిఫెస్టో తొలి కాపీలను ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన నలుగురికి అందజేశారు. విశ్వబంధు, స్వస్థ భారత్, సురక్షిత భారత్, సుస్థిర భారత్, సమృద్ధ భారత్, సాంకేతిక, ప్రపంచ తయారీ కేంద్రం, అత్యుత్తమ శిక్షణ, క్రీడా, సాంస్కృతిక వికాసం, ఈజ్ ఆఫ్ లివింగ్, సుపరిపాలన అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

మ్యానిఫెస్టోలోని కీలక అంశాలు

ట్రాన్స్‌జెండర్లకూ ఆయుష్మాన్ భారత్; వందేభారత్ స్లీపర్, చైర్ కార్, మెట్రో రైల్ సర్వీసుల ప్రారంభం; జాతీయ విద్యా విధానం అమలు; 2036లో ఒలింపిక్స్ నిర్వహణ; పీఎం ఆవాస్ యోజనలో దివ్యాంగులకు ప్రాధాన్యం; యువతకు మౌలిక సదుపాయాల కల్పన; పర్యాటక రంగంలో లక్షల ఉద్యోగాల కల్పన; 3కోట్ల మంది మహిళలను లక్షాధికారుల చేసే లక్ష్యం; ఈశాన్యంలో సైన్యానికి ప్రత్యేకాధికారాల చట్టం క్రమంగా ఎత్తివేత; ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా గిగ్ వర్కర్లు, ట్యాక్సీ, ఆటో, ట్రక్కు డ్రైవర్లకు సంక్షేమ పథకాలు; తిరువళ్లూర్ కల్చరల్ సెంటర్ ద్వారా భారత సంస్కృతి ప్రపంచ దేశాలకు పరిచయం; ఉన్నత విద్యాసంస్థల్లో భారతీయ భాషల అధ్యయనానికి తోడ్పాటు; ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి ప్రయత్నం; ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా శాటిలైట్ పట్టణాలు; ఏకలవ్య పాఠశాలలు, పీఎం జన్‌మన్ పథకాలకు ప్రాధాన్యం; అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం.

నిరుద్యోగం కనపడలే.. ద్రవ్యోల్బణం వినపడలే

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

దేశ ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అనే అంశాలు బీజేపీ మ్యానిఫెస్టోలో లేనే లేవని, మోదీ ప్రసంగంలోనూ వినపడలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. ఈమేరకు ఆయన ట్వీట్ చేశారు. ఈ రెండు అంశాలపై చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని విమర్శించారు. యువత ఈసారి మోదీ వలలో పడదని, ఉపాధి విప్లవం రాబోతోందని వ్యాఖ్యానించారు. కాగా, మోదీ గ్యారెంటీ ఒక జుమ్లా అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు ఆదాయం రెట్టింపు చేశారా? అని నిలదీశారు. దక్షిణాదికీ బుల్లెట్ రైలు అంటున్నారని.. మొదటి బుల్లెట్ రైలే ఇంకా పట్టాలెక్కలేదని ఎద్దేవా చేశారు.

సెల్ టవర్ లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్స్‌లో చైనా విప్లవాత్మక ఆవిష్కరణను తీసుకొచ్చింది. భూమిపై ఉన్న సెల్ టవర్ల అవసరం లేకుండా నేరుగా స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్‌ను సాధ్యం చేయగలిగేలా ప్రపంచంలోనే మొదటి ఉపగ్రహాన్ని ఆ దేశ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్వర్గంతో కనెక్ట్ అవ్వడం అని అర్థం వచ్చేలా దీనికి 'టియాంటాంగ్' అని దీనికి పేరుపెట్టారు. ఎనిమిదేళ్ల క్రితం చైనా రోదసీలోకి పంపిన 'టియాంటాంగ్-1' ఉపగ్రహ శ్రేణి ప్రస్తుతం మూడుకు చేరింది. ఇవి జియోసింక్రోనస్ కక్ష్యలో తిరుగుతూ మొత్తం ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని కవర్ చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతమంతా మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీకి మార్గం సుగమమైంది. చైనాకు చెందిన 'హువావే' ఇప్పటికే ప్రపంచంలోనే శాటిలైట్ కనెక్టివిటీని సపోర్ట్ చేసే మొదటి మొబైల్ కంపెనీగా గుర్తింపు పొందింది. హువావే టెక్నాలజీస్ గతేడాది సెప్టెంబరులో శాటిలైట్ కాల్స్‌కు మద్దతునిచ్చే స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ జాబితాలో షియోమి, హానర్, ఒప్పో వంటి మొబైల్ కంపెనీలు కూడా చేరాయి. గతేడాది డిసెంబరు 18న చైనాలోని గాన్సు ప్రావిన్స్‌లో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు.. సాంప్రదాయ కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయలేదు. ఈ సమయంలో బాధితుల్లో కొందరు శాటిలైట్ కాల్ సౌకర్యం ద్వారా బాహ్య ప్రపంచంతో సమాచారాన్ని పంచుకోగలిగారు.

కొమ్మాలపాటికి పల్నాడు జిల్లా పగ్గాలు



గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని పేదల పెన్నిధిగా పెదకూరపాడు నియోజకవర్గంలో మమేకమైన కొమ్మాలపాటికి ఈ పర్యాయం ఎమ్మెల్యే టిక్కెట్టు అధిష్టానం ఇవ్వలేక పోయింది. అయితే అందుకు ప్రతిగా కొమ్మాలపాటికి తగిన ప్రాధాన్యం కల్పించాలని నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. తాము అధికారంలోకి రాగానే కొమ్మాలపాటికి ఎమ్మెల్సీ పదవి కట్టబెడతానని పెదకూరపాడు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సభలో చంద్రబాబు బహిరంగంగా చెప్పారు. పార్టీ అధికారంలోనికి రావడమే ముఖ్యమని భావించిన శ్రీధర్ ఇప్పటికే తనకు బదులుగా సీటు దక్కించుకున్న భాష్యం ప్రవీణ్ విజయానికి అహర్నిశలు పాటుపడుతున్నారు. అందరూ ఊహించిన విధంగానే శ్రీధర్‌కు పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని అధిష్టానం కట్టబెడుతూ ఆదేశాలు జారీ చేసింది.

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శివరామ్



సత్తెనపల్లి, ఏప్రిల్ 14: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ నేత డాక్టర్ కోడెల శివరామ్‌ను టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కోడెల శివరామ్ నియామకం పట్ల పలువురు టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు డాక్టర్ కోడెల శివరాం కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడుకు డాక్టర్ కోడెల కుటుంబం అంటే ఎంతో అభిమానం అని అన్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించడమే తన ధ్యేయం అన్నారు. డాక్టర్ కోడెల అభిమానులు పలువురు డాక్టర్ కోడెల శివరాంకు అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి



గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా తాడిశెట్టి మురళీమోహన్ నియమితుడయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవలే టీడీపీలో చేరిన మురళీమోహన్‌కు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడం ద్వారా చంద్రబాబు తగిన గౌరవం ఇచ్చారు. వైఎస్ మరణానంతరం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన మురళి ఆ పార్టీ కోసం కష్టపడ్డారు. అయితే సీఎం జగన్ తాడిశెట్టి సోదరులకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా అన్యాయం చేశారు. మరోవైపు వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత కూడగట్టుకోవడంతో తాడిశెట్టి అనుచరుల విజ్ఞప్తి మేరకు ఇటీవలే టీడీపీలో చేరారు. తనను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడంపై తాడిశెట్టి మురళీమోహన్ స్పందిస్తూ అధినేత చంద్రబాబునాయుడుకు, నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు, పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో పలువురికి పదవులు

- కార్యనిర్వాహక కార్యదర్శిగా నల్లపాటి
- కార్యదర్శులుగా పంగులూరు, కళ్లం



నల్లపాటి రామచంద్ర ప్రసాద్, పంగులూరు అంజయ్య

నరసరావుపేట, ఏప్రిల్14: రాష్ట్ర టీడీపీ కమిటీలో జిల్లాకు చెందిన నేతలు పలువురికి చోటు దక్కింది. కార్యనిర్వహక కార్యదర్శిగా నరసరావుపేట నియోజకవర్గానికి చెందిన నల్లపాటి రామచంద్రప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. గతంలో నల్లపాటి రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. నరసరావుపేట అసెంబ్లీ టిక్కెట్‌ను కూడా అయన ఆశించారు. మాచర్ల నియోజకవర్గానికి చెందిన కళ్లం రామాంజిరెడ్డి, పంగులూరు అంజయ్యను రాష్ట్ర పార్టీ కార్యదర్శులుగా నియమించారు. తమను నియమించడం పట్ల నల్లపాటి, పంగులూరు, కళ్లంలు పార్టీ అధిష్టానం, జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీకి రాజీనామా చేసిన ఎస్సీ సెల్ నేత



గద్దల వేదమణి


దాచేపల్లి, ఏప్రిల్ 14: వైసీపీ నాయకత్వం నియంతృత్వ పోకడలను వ్యతిరేకిస్తూ కార్మిక నాయకులు, వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గద్దల వేదమణి పార్టీ పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆదివారం వేదమణి మాట్లాడుతూ వైసీపీలో తాను కొనసాగటం ఇష్టంలేకనే పార్టీకి రాజీనామా చేశానని వివరించారు. డాక్టర్ అంబేద్కర్ ఇచ్చిన ఆత్మగౌరవం, బడుగు బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా తాము ఆయన బాటలో ప్రయాణం చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో తన రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తానని వివరించారు.

జంట నగరాల నుంచి తరలిరానున్న ఓటర్లు

- మే 10, 11, 12 తేదీల్లో రైళ్లలో బుకింగ్ అయిపోయిన టిక్కెట్‌లు
- కేవలం ఒక్క వందేభారత్‌లో మాత్రమే ఖాళీలు
- అవి కూడా కొద్ది రోజుల్లో రిజర్వేషన్ అయిపోయే అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని సికింద్రాబాద్, హైదరాబాద్‌లలో నివసిస్తున్న జిల్లాకు చెందిన ప్రజలు ఓటుహక్కుని వినియోగించుకొనేందుకు భారీగా స్వస్థలాలకు రానున్నారు. మే 13న సోమవారం పోలింగ్ జరగనుండటంతో ఆ నెల 10, 11, 12 తేదీల్లో జిల్లాకు వచ్చేందుకు ఇప్పటికే వేలమంది రైళ్లలో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్నారు. ఈ కారణంగా ఆ మూడురోజుల్లో ఒక్క వందేభారత్ మినహా సికింద్రాబాద్‌లో బయలుదేరి గుంటూరు మీదగా ప్రయాణించే ఏ ఒక్క రైలులోనూ ఖాళీలు లేవు. చెన్నై ఎక్స్‌ప్రెస్‌కి అయితే కనీసం వెయిటింగ్ లిస్టులోనూ టిక్కెట్ బుకింగ్ చేసుకొనే అవకాశమే లేకుండా నోబుకింగ్ పడిపోయింది. దీంతో ప్రత్యామ్నాయంగా ఆర్‌టీసీ, ప్రైవేటుబస్సులు, సొంత వాహనాల్లో ప్రజలు ఓటువేసేందుకు రావాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రద్దీని దృష్టిలో పెట్టుకొని ఛార్జీలు పెంచేందుకు ప్రైవేటుట్రావెల్స్ ఆపరేటర్లు సిద్ధమయ్యారు.

సికింద్రాబాద్ నుంచి ప్రధానంగా గుంటూరుకు ఇంటర్‌సిటీ, పల్నాడు, ఫలక్‌నుమా, నారాయణాద్రి, నరసపూర్, శబరి, విశాఖ, చెన్నై, డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లు వస్తుంటాయి. దీంతోపాటు వరంగల్ మీదగా గోల్కొండ, ఇంటర్‌సిటీ రైళ్లు వస్తాయి. నంద్యాల మార్గంలోనూ మరో రెండు రైళ్లు గుంటూరుకు చేరతాయి. లింగంపల్లి - విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో వెయిటింగ్ లిస్టు మూడు తేదీల్లో 105నుంచి 204 మధ్యన ఉన్నది. ఫలక్‌నుమాలో 200 దాటిపోయింది. జన్మభూమిలో అయితే మే 11వ తేదీన నో బుకింగ్ పడింది. నారాయణాద్రి రైలులోనూ 155వరకు వెయిటింగ్ లిస్టు ఉన్నది. నరసపూర్‌లో మే 11న రిగ్రెట్ 10, 12తేదీల్లో 300 వెయిటింగ్ లిస్టు దాటింది. శబరి, విశాఖ, పల్నాడులోనూ చాంతాడంత వెయిటింగ్ లిస్టులున్నాయి. చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో మూడు రోజులు రిగ్రెట్ పడటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లోనూ వెయిలింగ్ లిస్టు 203కి చేరింది.



చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో మే 10, 11, 12 తేదీల్లో రిగ్రెట్

వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొంటే మే 10, 11, 12 తేదీల్లో దాదాపుగా 50వేల నుంచి 60వేల మధ్యన ప్రయాణీకులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని వేర్వేరు ప్రాంతాలకు ఒక్క రైళ్లలో రానున్నారని స్పష్టమౌతున్నది. ఇక బస్సులు, సొంత వాహనాల్లో వచ్చేవారి సంఖ్య కూడా మరో 25వేలకు పైగా ఉండొచ్చని అంచనా. దీని దృష్ట్యా దాదాపుగా 50వేల మందికి పైగానే జంట నగరాల్లో నివసిస్తున్న ఓటర్లు ఇక్కడికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకో నున్నారని అంచనా. రెండు రాష్ట్రాల్లోనూ 11 రెండో శనివారం, 12 ఆదివారం, 13 పోలింగ్ డే సెలవుదినాలు కావడంతో ఓటు వేసేందుకు అందరూ తరలి వస్తున్నారు. ఎన్నికల ఫలితాల్లో వీరి ఓట్ల ప్రభావం కూడా ఈ దఫా ఎక్కువగానే ఉంటుందని అంచనా.

మూడు రాజధానులు ముగిసిన అధ్యాయం

- 1580వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్ 14: రాజధాని అమరావతి విషయంలో సీఎం జగన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పాడని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు ఆదివారం నాటికి 1580వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలు, రైతులు మాట్లాడుతూ అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటతో నిర్వీర్యం చేశాడన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన పరిపాలన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్ళేంత వరకు వచ్చిందన్నారు. మూడు ప్రాంతాల అభివృద్ధి గురించి ఆలోచించకుండా ప్రయోజనం లేని మూడు రాజధానుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతి అభివృద్ధిని కాలరాసిన వైసీపీ పాలకులను చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు నిరసనలు కొనసాగుతున్నాయి.



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

ఒక్క రూపాయి కూడా అవినీతికి పాల్పడను

- పవన్ ముందు ప్రమాణం చేసిన డాక్టర్ పెమ్మసాని



తెనాలి వచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నాకు డబ్బు మీద ఆశ లేదు, కీర్తికాంక్షలు మీద ఆశ అంతకంటే లేదని తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం తెనాలి పర్యటనకు వచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ తనకు స్వార్థం ఏమాత్రం లేదన్నారు. పవన్ కళ్యాణ్ ముందు ప్రమాణం చేసి చెబుతున్నా వచ్చే 30 సంవత్సరాలు ఒక్క రూపాయి కూడా అవినీతి చేయనన్నారు. ప్రజల అభిమానాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి ఇస్తానని చెప్పారు.

రైల్వేస్టేషన్లలో తాగునీటికి ఏర్పాట్లు

- ప్రధాన ప్లాట్‌ఫాంలపై వాటర్ కూలర్లు



రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ ట్యాప్‌లు

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచే ఎండలు మండుతుండటం, వడగాడ్పులు వీస్తుండటంతో రైళ్లలో ప్రయాణం చేసేవారు తాగునీటికి ఇబ్బంది పడకుండా రైల్వేశాఖ విస్తృత ఏర్పాట్లుచేసింది. రైళ్లు ఆగే ప్రతీ రైల్వేస్టేషన్ లోనూ వాటర్ కూలర్లను ఏర్పాటుచేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. అలానే స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతోనూ చల్లని తాగునీటిని అందించే సదుపాయాలను ఏర్పాటు చేశామన్నాయి. రూ.5కే లీటర్ శుద్ధి చేసిన నీటిని విక్రయించే ఆర్‌వో ప్లాంట్లను కూడా 24 గంటలు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నాయి. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో తాగునీటి సదుపాయం కల్పించామని డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. హై లెవల్, గ్రౌండ్ లెవల్ ట్యాంకులలో నీటి లభ్యత పుష్కలంగా ఉండేలా చూసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశామని డీఆర్ఎం తెలిపారు.

జగన్‌రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా టీడీపీదే విజయం

- టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

గుంటూరు, ఏప్రిల్ 14: జగన్ రెడ్డి మీద రాయితో ఎవరు దాడి చేసినా తప్పు తప్పే దానిని టీడీపీ ఖండిస్తుందని అయితే జగన్ రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా అంతిమ విజయం టీడీపీదేనని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ అన్నారు. జగన్ రెడ్డి గత ఎన్నికల్లో కోడి కత్తి డ్రామా, బాబాయి హత్య వంటి నాటకాలలో భాగమే ప్రస్తుత రాయి దాడి అని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. జగన్ జరగని దాడిని జరిగినట్లు ప్రచారం చేసుకొని సానుభూతి కోసం పాకులాడుతున్నారన్నారు. ఇలాంటి కుట్రలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మటానికి సిద్ధంగా లేరన్నారు. దాడి జరిగిన నాలుగు నిమిషాల్లోనే క్యాట్ బాల్ ఉపయోగించారు అని వైసీపీ అనుకూల మీడియాకు ఎలా తెలిసింది అని ప్రశ్నించారు. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లో డీజీపీ, ఇంటిలిజెన్స్ ఐజీ ఆడిన నాటకంలో భాగంగానే ఈ దాడి అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి మీద దాడి జరిగితే ఇక సామాన్య జనం భద్రత ఈ జగన్ ప్రభుత్వంలో ఎలా ఉందో అందరికి అర్థం అవుతుందన్నారు. జగన్‌రెడ్డి ఈ ఎన్నికలలో ఘోర పరాజయం చవిచూస్తారని అన్నారు.

డాబా పైనుంచి పడి వ్యక్తి మృతి

దాచేపల్లి, ఏప్రిల్ 14: ప్రమాదవశాత్తు డాబా పైనుండి కిందపడి తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని గామాలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రోళ్ల ప్రసాదరావు (40) ఈ నెల 12వ తేదీన డాబాపైన నిద్రిస్తూ మధ్యలో నిద్రలేచి ఏమరుపాటుగా వున్న సమయంలో డాబా పైనుంచి జారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు. కుటుంబసభ్యులు గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు.

కొలువుదీరిన ఎఫ్‌పీఎస్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆదివారం నగరంలోని అరండల్‌పేటలో ఉన్న అసోసియేషన్ హాల్‌లో నూతన అధ్యక్షుడిగా వజ్రాల వెంకట నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.అశోక్ ఆనంద రెడ్డి, కోశాధికారిగా కె.విజయకుమార్, నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులు, 52మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి గౌరవాధ్యక్షుడు పోసాని నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో డీలర్లకు ఏ సమస్యలు వచ్చినా కూడా వాటిని అందరం కలిసికట్టుగా ఎదుర్కొంటామన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం

సమావేశంలో రసాభాస

సమావేశంలో కొద్దిసేపు రసాభాస జరిగింది. అసోసియేషన్ నూతన కార్యవర్గానికి జరిగిన ఎన్నికల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకగ్రీవంగా కాకుండా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలానే అసోసియేషన్‌కు రూ.కోటి నిధి ఉందని, జమాఖర్చుల వివరాలు బయట పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం అసంతృప్తులను బుజ్జగించి వారికి నామినేటెడ్ పదవులు ప్రకటించి ప్రమాణ స్వీకారాన్ని ముగించారు.

'పశ్చిమ' ఎన్నికల పరిశీలకుడిగా మల్లెల రాజేశ్ నాయుడు



గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన మల్లెల రాజేశ్ నాయుడు నియమితులయ్యారు. ఆ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటన విడుదల చేశారు.

క్రేన్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



సలోమాన్ మృతదేహం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 14: వెనుకగా వచ్చిన క్రేన్ ఢీకొనడంతో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన మాచర్లలో ఆదివారం రాత్రి జరిగింది. రెంటచింతల మండలం తుమృకోటకు చెందిన ఆలేటి సలోమాన్(45) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి తుమృకోట నుంచి ప్రయాణికులతో ఆటోలో మాచర్ల పట్టణానికి చేరుకున్నాడు. ఆటోను కూరగాయల మార్కెట్ వద్ద నిలిపి టీ తాగేందుకు పార్కుసెంటర్‌కు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా వెనుకగా స్పీడ్‌గా వచ్చిన క్రేన్ బలంగా ఢీకొట్టగా కిందపడిపోయాడు. అతని తలపై నుంచి క్రేన్ దాటింది. దీంతో తల పగిలి సలోమాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శరత్‌బాబు సంఘటనా ప్రదేశానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్రేన్ డ్రైవర్ కొండమల్లి లక్ష్మణస్వామిని అదుపులోకి తీసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే పీఆర్కే ప్రచారంలో గజమాల వేసి వస్తూ..

కాగా పట్టణంలోని 30వ వార్డు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి గజమాల వేసేందుకు వైసీపీ శ్రేణులు శ్రీలక్ష్మీ క్రేన్ సర్వీసుకు చెందిన ఏపీ39 ఈఈ 5424 నంబరు గల క్రేన్‌ను ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే పీఆర్కేకు గజమాల వేసి ప్రచారం ప్రారంభమయ్యాక తిరిగి వెళ్తూ పార్కు సెంటర్లో సలోమాన్‌ను రోడ్డు దాటుతుండగా ఢీకొట్టి అతని మృతికి కారణమైంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కేదారినాథ్ మృతదేహం

కాకుమాను, ఏప్రిల్ 14: వాహనం ఢీ కొనడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అప్పాపురంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రవీంద్ర కథనం మేరకు... గణపవరపు కేదారినాథ్(19) బైక్‌పై అప్పాపురం నుంచి పెదనందిపాడు వైపు వెళుతున్నాడు. శివారు మలుపులో వేగంగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొంది. దీంతో కేదారినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కేదార్‌నాథ్‌ది బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం భీమవరం గ్రామం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కాకుమాను పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.04
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

సానుభూతి కోసమే గులకరాయి డ్రామా: అనగాని



రేపల్లె: ఎన్నికల్లో సానుభూతి కోసమే ముఖ్యమంత్రి జగన్ గులకరాయి డ్రామా ఆడుతున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆది వారం ఓ లేఖలో పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ప్రజలకు చెప్పుకోవటానికి ఒక్క మంచిపని చేయకపోగా అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారనన్నారు. ఒక్క పరిశ్రమను తేకపోగా ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయకుండా రాష్ట్రాన్ని అగాథంలో నెట్టారన్నారు. జగన్‌రెడ్డి చేపట్టిన ఎన్ని కల ప్రచారంలో తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమౌటంతో కొత్త డ్రామాకు తెరలేపరన్నారు. నాలుగు రోజుల్లో సంచలన ఘటన రాష్ట్రంలో జరుగుతుందని ఈ ఘటన ఎన్నికల మూడ్ మార్చివేస్తుందని వైసీపీ నేత అవుతు శ్రీధర్‌రెడ్డి చెప్పిన నాలుగోరోజే ఈ గులకరాయి ఘటన జరగటం ఈ డ్రామాలో భాగం కాదా అని ప్రశ్నించా రు. రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

గులకరాయి డ్రామాను ఎవరూ నమ్మరు : యరపతినేని



పిడుగురాళ్ల, ఏప్రిల్ 14: ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి పరదాల చాటున తిరుగుతూ ఇప్పుడు ఎన్నికలకు ముందు సరికొత్త నాటకమైన గులకరాయి డ్రామాను రాష్ట్ర ప్రజలు ఎవరు నమ్మే స్థితిలో లేరని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్లలో యరపతినేని విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు కోడికత్తి డ్రామా, వివేక గొడ్డలి వేటు డ్రామాను రాష్ట్ర ప్రజలు ఎవరూ కూడా నమ్మలేదని, దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ కూడా కోడికత్తి కేసులో జగన్ ఆడించిన డ్రామానేనని నిగ్గు తేల్చిందన్నారు. అధికారంలో ఉన్న జగన్ సభకు విద్యుత్ నిలిపివేసి చీకట్లో ఆడిన డ్రామాను చూసి రాష్ట్ర ప్రజలందరూ నిన్ను నమ్మం జగన్ అంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌కు ఉన్న భద్రత, నిఘా అధికారులు, రోప్ పార్టీ ప్రత్యేక బలగాలు, నిరంతరం లైవ్ కార్యక్రమాలు ఉండే సభలను గులకరాయి డ్రామా సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు.

కోడికత్తి తరహాలో గులకరాయి డ్రామా: జీవీ



వినుకొండటౌన్, ఏప్రిల్14: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి జనాదరణ కోల్పోయి ఎన్నికల సమయంలో ప్రజల సానుభూతి కోసం మరోసారి డ్రామా లకు తెరలేపారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ఆస్కార్ స్థాయి నటనలు, గోబెల్స్‌ను మించిన వైసీపీ ఐప్యాక్ అబద్ధపు ప్రచారాన్ని చూసి నవ్వుకుంటున్నా వారికి సిగ్గు రావడం లేదన్నారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోని తెలుగుదేశం పార్టీ వారే దాడిచేశారని చిత్రీకరించడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే వైసీపీ నాయకులు చేతుల్లో పట్టుకున్న ప్లకార్డులను కూడ ముందే సిద్ధం చేసుకున్నారంటే మరింత ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ నాటకం కోసమే కరెంటు కూడా తీసివేశారన్నారు. విజయవాడలో జరిగిన ఘటనలో పెద్ద కుట్ర దాగి ఉందని నాడు కోడికత్తి డ్రామా ఓట్లు కురిపించినట్లే ఈ నాటకంతో జనం మారిపోతారనే భ్రమలో జగన్, ఆ పార్టీ నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. కాని ప్రతిసారి కట్టుకథలు నమ్మడానికి ప్రజలు అమాయికులు కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, జగన్మోహన్ రెడ్డి చొరవతో చెరువులు నింపారని అనడం హాస్యస్పదంగా ఉందన్నారు. తాగు నీటి పథకానికి 160కోట్లు నిధులు తెస్తే ఖర్చు చేయని అసమర్థ ఎమ్మెల్యే బొల్లా అన్నారు. కార్యక్రమంలో పత్తి పూర్ణ, దాసయ్య, షమీమ్, దాసరి కోటేశ్వరరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

జనాదరణ లేక జగన్నాటకానికి తెర : ధూళిపాళ్ళ



పొన్నూరుటౌన్, ఏప్రిల్14: జనాదరణ లేకపోవటంతో సరికొత్త జగన్నాటకానికి తెర తీసారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ జగన్‌పై జరిగిన దాడిని అందరూ ఖండించాలన్నారు. కానీ దాడి జరిగిన పది నిమిషాలోనే మంత్రులు అధికార పార్టీ నాయకులు సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీపై వ్యతిరేకంగా పోస్టులు పెట్టారన్నారు. రోడ్ షోలో కరెంటు తీసి దాడికి పాల్పడింది అధికార పార్టీ వారేనని ఆరోపించారు. సానుభూతి కోసమే దాడి నాటకానికి తెరలేపారన్నారు. కోడి కత్తి కేసులో తెలుగుదేశం పార్టీ పాత్ర లేదని ఎన్ఐఏ నిర్ధారించిందని చెప్పారు. అలాగే వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆ నాడు చంద్రబాబు పాత్ర ఉందని వైసీపీ నాయకులు ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కేసులో ఇంత వరకు విచారణ ప్రారంభం కాలేదన్నారు. మొన్న కోడి కత్తి డ్రామా అడిన వారు ఇప్పుడు రాయి డ్రామా అడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలులో ఉన్నప్పటికి వైసీపీ వర్గీయులు రోడ్లపైకి వచ్చి నిరసనలు సాగించారన్నారు. రాబోయే ఎన్నికల్లో సానుభూతి కోసమే రాయి డ్రామాగా పేర్కొన్నారు.

కొత్త డ్రామాకు తెర తీసిన జగన్: ఆనందబాబు



వేమూరు, ఏఫ్రియల్ 14: ముఖ్యమంత్రి జగన్ తిరిగి తెరపై కొత్త డ్రామాకు తెర తీయడం జరిగిందని మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధినేత కుట్రపూరిత రాజకీయంతో జగన్‌పై రాళ్ళు వేయించారని అసత్యాలు పలకడం సరికాదని ఖండించారు. గతంలో ఎన్నికల ముందు కూడా ఇలాగే ప్రజల నుంచి సానుభూతిని పెంచుకునేందుకు కోడికత్తి కేసును సృష్టించడం జరిగిందన్నారు. అధికారం కోసంగా పూర్తిగా దిగజారి జగన్ ప్రవర్తిస్తున్నాడని అన్నారు. ఎన్నికలకు నెల ముందుగా బాబాయిని దారుణ హత్య చేయించిన జగన్ తిరిగి ఈ రోజున కచ్చితంగా ఎన్నికలకు నెల ముందు రాయి దాడి ఉదంతాన్ని ప్రజల్లోకి తీసుకురావడం తిరిగి అధికారం కోసమే చేస్తున్న ప్రయత్నంలో భాగమన్నారు. ఇలాంటి దుష్ట ఆలోచన మీద ఆధారపడి ఎంత కాలం బతుకుతాడు అని కూడా ప్రశ్నించారు. ప్రజలు ఒక్కసారి నమ్ముతారు కానీ పదే పదే అలాంటి తప్పుడు వ్యవహారాలు చేస్తే నమ్మటానికి ఏ ఒక్కరూ గాజులు తడుక్కొని లేరు అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి రాష్ట్రానికి భద్రత కల్పించాల్సిన నువ్వే నీకు భద్రత లేదు అని చెప్పుకోవడం సిగ్గు లేదా అని అన్నారు. నీ చేతగాని తనం బట్టబయలు అవుతుందని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆయన తనయుడు లోకేష్ పర్యటనలో కరెంట్ కట్ చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని తక్షణమే జగన్‌పై రాయి విసిరిన ఘటన మీద విచారణ జరిపించి దోషులను శిక్షించడం జరుగుతుందన్నారు.

నాడు కోడి కత్తి.. నేడు గులకరాయి డ్రామా: బ్రహ్మరెడ్డి



మాచర్లటౌన్, ఏప్రిల్ 14: జగన్ యాత్రకు ప్రజా స్పందన లేకపోవడంతో, బస్సు యాత్ర తుస్సుమనడంతో బులుగు మీడియా ఆధ్వర్యాన నెత్తికి రాయి డ్రామా మొదలుపెట్టారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తి, బాబాయి హత్యడ్రామాలు ఆడి ప్రత్యర్థులపై నిందలు మోపి జగన్ అధికారంలోకి వచ్చాడని అన్నారు. ఘటన జరిగిన నాలుగో నిమిషానికే బులుగు మీడియాలో క్యాట్‌బాల్‌తో దాడి చేశారని ఎలా చెప్పగలిగారన్నారు. డ్రామా జరిగినప్పుడు చుట్టూ వైసీపీ నేతలు, పోలీసులే ఉన్నారని, నిందితులను ఎందుకు పట్టుకోలేదని అన్నారు. క్యాట్ బాల్‌తో కొడితే కనుబొమ్మల పైనే ఎలా తగులుతుందని, దీనిపై ప్రజలందరికీ అవగాహన ఉందని అన్నారు. ముఖ్యమంత్రిపై జరిగిన దాడి పూర్తిగా విజయవాడ సీఎస్ వైఫల్యమన్నారు. లేకపోతే కుట్రలో భాగస్వాములా..? గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసురుతుంటే భద్రతా వలయం ఏం చేస్తోందని ప్రశ్నిచారు. విజయవాడలో రాత్రి 7 గంటలకు కరెంట్ పోవడం, 8:10 గంటలకు దాడి అంటూ ప్రచారం చేసుకోవడం, 11 గంటలకు కుటుంబ సమేతంగా ఆసుపత్రికి వెళ్లడం ఇదంతా సానుభూతి డ్రామా కాదా అని ప్రశ్నించారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



గోలిలో ఎన్నికల ప్రచారంలో బ్రహ్మారెడ్డి

మాచర్ల దొరల పాలనకు స్వస్తి పలుకుదాం

● నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, ఏప్రిల్ 14: మాచర్ల నియోజకవర్గంలో దొరలు రాజ్యమేలుతున్నారు.. గుడుంబా శక్తులు పెట్రేగి పోతున్నారు.. అరాచ శక్తులకు అడ్డూ అదుపు లేదు.. మన భవిష్యత్ బాగుండాలంటే వారి పాలనకు చరమగీతం పాడి టీడీపీని గెలిపిద్దామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మండలంలోని గోలిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత పమిడి నాగేశ్వరరావు, త్రిపుర రామేశ్వరరావుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి బడుగు జీవులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. రాక్షస పాలన కావాలా.. రామరాజ్యం కావాలో ఓటర్లు నిర్ణయించుకొని తగు విధంగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కోరే నాగేశ్వరరావు, త్రిపుర గోవర్ధన్, కోరె కోటయ్య, అంజి, గోపి, శ్రీను, మణికంఠ, వీరయ్య, బాబు, సాంబయ్య, శ్రీను, థామస్ తదితరులతో పాటు టీడీపీ మండల శ్రేణులు పాల్గొన్నారు.

కాపులకు అండగా నిలిచింది టీడీపీనే ..

కారంపూడి: కాపులకు అండగా నిలిచింది టీడీపీనే అని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని ఇనుపరాజుపల్లెలో శనివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కాపులకు తీవ్ర అన్యాయం చేసిందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కాపులంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, కర్ణా సైదారావు, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, జనార్ధన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక.. మండలంలోని ఇనుపరాజుపల్లెకు చెందిన 50 కాపు వైసీపీ కుటుంబాలు శనివారం రాత్రి ఆ పార్టీని వీడి ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు...

మాచర్లటౌన్ : అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని పార్కుసెంటర్లో గల అంబేద్కర్ విగ్రహానికి జూలకంటి బ్రహ్మారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి పేదవాడికి న్యాయం జరగాలంటే అంబేద్కర్ రాజ్యాంగం తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పేరువాల పుల్లారావు, మాచర్ల వాసు, రూబెన్, దుర్గారావు, గుండాల శ్రీను, మైనార్టీ నేత బాబుఖాన్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న బ్రహ్మారెడ్డి

సానుభూతి కోసం జగన్ గులకరాయి డ్రామా

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఏప్రిల్ 14 : గొడ్డలి వేటు, కోడికత్తి డ్రామాల ఘటనలను సీఎం జగన్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రచార అస్త్రాలుగా మార్చుకోగా, నేడు గులకరాయి డ్రామాకు తెరలేపాడని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం గుంటూరులోని కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో కలసి శ్రీధర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో సీఎం జగన్ ప్రజలకు చెప్పుకోవటానికి ఒక్క మంచి పని చేయలేదని, అనుభవ రాహిత్యం, అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, నాలుగు రోజుల్లో సంచలన మైన సంఘటన జరుగుతుందని, ఎన్నికల మూడ్‌ను మార్చేస్తుందంటూ వైసీపీ నేత అవుతు శ్రీధర్‌రెడ్డి చెప్పిన నాలుగో రోజే ఈ గులక రాయి సంఘటన జరగటం ఆ డ్రామాలో భాగం కాదా అని ప్రశ్నించారు. రాత్రి 11 గంటలకు కుటుంబ సమేతంగా ఆస్పత్రికి వెళ్ళటం సానుభూతి నాటకం కాదా? అని ప్రశ్నించారు. ఘటన జరిగిన నాలుగో నిమిషానికే క్యాట్‌బాల్ ఉపయోగించారని సాక్షి, బులుగు మీడియాకు, జగన్ సోషల్ మీడియాకు ఎలా తెలుసునని ఆయన ప్రశ్నించారు. డ్రామా జరిగినప్పుడు చుట్టూ ఉన్నది వైసీపీ కార్యకర్తలు, పోలీసులు, మరి నిందితుడిని ఎందుకు పట్టుకోలేదని ఆయన అన్నారు. జగన్ డ్రామాలను ప్రజలు నమ్మే రోజులు పోయాయని, రానున్న రోజుల్లో వైసీపీకి గుణపాఠం చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

హత్యారాజకీయాల సంస్కృతి టీడీపీకి లేదు

● పెదకూరపాడు నియోజక వర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఏప్రిల్ 14: హత్యా రాజకీయాలు చేసే నీచ సంస్కృతి టీడీపీకి , చంద్రబాబు నాయుడుకి లేదని, ఆ సంస్కృతిని వంట పట్టించుకున్న వారు వైసీపీ నేతలేనని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం క్రోసూరు మండలం దొడ్లేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు విశాఖపట్నంలో కోడి కత్తి డ్రామా ఆడారని, ఆ తర్వాత బాబాయిని హత్య చేశారని, ఇప్పుడు గులక రాయి డ్రామా ఆడుతున్నారని, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వారి కుటుంబంలో ఎవరికి మూడిందో వారే ఆలోచించుకోవాలని వ్యంగ్యంగా అన్నారు. నీచ, హింస, హత్యా, శవ రాజకీయాలు చేసేది వైసీపీ వారేనన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. ముఖ్యమంత్రిపై నిజంగా దాడి జరిగితే అందరూ ఖండించాల్సిన విషయమేనని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన ప్రభుత్వం పైన, పోలీసులపై ఉందని ఆయన అన్నారు. సమావేశంలో ఆయనతో లావు రత్తయ్య ఉన్నారు.

ప్రవేశ పరీక్ష హాల్ టిక్కెట్లు విడుదల

దాచేపల్లి, ఏప్రిల్ 14: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి మోడల్ స్కూల్‌లో 6వతరగతి ప్రవేశానికి హాల్‌టిక్కెట్లు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ ఐడీ, పుట్టినతేదీ ఎంటర్‌చేసి హాల్‌టిక్కెట్లు పొందాలని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో పరీక్ష రాయవచ్చునని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలియజేశారు.



ఎమ్మెల్సీ జంగా సమక్షంలో టీడీపీలో చేరిన ఎస్సీ, బీసీ సామాజికవర్గాల వారు

జంగా సమక్షంలో టీడీపీలోకి చేరికలు

మాచవరం, ఏప్రిల్ 14: మండలంలోని రేగులగడ్డ గ్రామంలో ఆదివారం ఎస్సీ, బీసీ సామాజికవర్గాల వారు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీ విధానాలు నచ్చక విసుగు చెంది టీడీపీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అందరిలాగే సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని వారికి సూచించారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కి ఘన నివాళులు

దాచేపల్లి: దాచేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి, పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో నేటి సమాజంలో జీవనం సాగిస్తున్నారంటే అంబేద్కర్ ఇచ్చిన చట్టాలు, ఆయన చేసిన త్యాగం, సేవలే ప్రధాన కారణమన్నారు. నేటి సమాజానికి, యువతకు అంబేద్కర్ జీవనం ఓ ప్రామాణికంగా తీసుకోవాలని జంగా పిలుపునిచ్చారు. సమాజంలో ఆత్మగౌరవం కోసం బడుగు బలహీనవర్గాలు నేటికీ పోరాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో భద్రి, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ విక్రాంత్, తిరుమల కుమార్, అచ్చారావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపు బాధ్యత యువతదే..

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తండ్రి రత్తయ్య

● కూటమి పార్టీల యువతతో ప్రత్యేక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్



ప్రసంగిస్తున్న విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య

క్రోసూరు, ఏప్రిల్ 14 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకు రావాల్సిన బాధ్యత యువ ఓటర్లపై ఉందని పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ కూటమి అభ్యర్థి బాష్యం ప్రవీణ్, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు తండ్రి లావు రత్తయ్య అన్నారు. క్రోసూరు మండలం దొడ్లేరు రావిపాటి కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన, బీజేపీ యూత్ సమావేశం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో 40 శాతం టిక్కెట్లు యువతకు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీని ఓడించి, కూట మిని గెలిపించి, చంద్రబాబుని సీఎంని చేస్తేనే రాష్ట్రానికి, యువతకు భవిష్యత్ ఉంటుందన్న విషయాన్ని యువ ఓటర్లు గ్రహించాలన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని నిలువునా దోచేసిందన్నారు. రాజధాని, పోలవరం నిర్మాణాలు, పట్టిసీమ నదుల అనుసంధానం వంటి ముఖ్యమైన పథకాలను వైసీపీ ప్రభుత్వం మూలనపడే సిందని, దర్వాత రాష్ట్ర ప్రగతి కుంటుపడిందని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, పారిశ్రామిక వేత్తలు ఇతర రాష్ట్రాలకు పారియోయే పరిస్థితిని అధికారపార్టీ నేతలు కల్పించార న్నారు. బాబు రావాలంటే బాబు రావాలన్న విషయాన్ని అన్ని వర్గాల ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు యువతీ యువకులు మాట్లాడారు. సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపాటి అమృతరావు, బీజేపీవైఎం నాయకులు, జనసేన నాయకులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు గుడిపాడు బాషా, దండా నాగేంద్ర పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తి యువతకు మార్గ నిర్దేశం కావాలి

బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తి నేటి తరం యువతీ యువకులతో పాటు ప్రజలందరికీ మార్గదర్శకం కావాలని భాష్యం ప్రవీణ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం క్రోసూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవద్ద ఉన్న అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహా లకు స్థానిక టీడీపీ నేతలతో కలసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుడిపాడు బాషా, కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, దుద్దుల యోహాన్, అనుముల వెంకట రామిరెడ్డి, అనుమాల పూర్ణ, చిలకా విజయపాల్, చిలకా కృష్ణారావు పాల్గొన్నారు.

అచ్చంపేటలో టీడీపీ ముమ్మర ప్రచారం

అచ్చంపేట: భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య, సోదరి పాటిబండ్ల శివరంజనీలు అచ్చంపేటలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇల్లు ఇల్లు తిరుగుతున్నారు. లావణ్య సమక్షంలో ఎస్కే కాసుల ఆధ్వర్యంలో మొగల్ సుభానీ, మొగల్ బాల సైదా, ఎస్కే జానీ తదితరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే భాష్యం ప్రవీణ్ తన బంధువులు అచ్చంపేటలోని పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, మొక్కపాటి గిరిబాబు, ఎస్కే కాసుల, సందెపోగు సామేలు, ఆంజనేయులు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న భాష్యం ప్రవీణ్

పిన్నెల్లిలో యరపతినేనికి జననీరాజనం

● కొబ్బరికాయలు కొట్టి యరపతినేనికి దిష్టితీసిన మహిళలు

● గత ఎన్నికల తర్వాత గ్రామం చేరుకున్న వారి సంబరాలు

● నేడు పిన్నెల్లిలో కూటమి నియోజకవర్గస్థాయి బహిరంగ సభ



పిన్నెల్లి గ్రామంలో పర్యటిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, ఏప్రిల్ 14:మండలంలోని పిన్నెల్లి గ్రామంలో సోమవారం నిర్వహించనున్న కూటమి నియోజకవర్గస్థాయి బహిరంగ సభ నిర్వహణ స్థల పరిశీలనకు గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఆగ్రామంలో పర్యటిం చారు. ముందుగా గ్రామంలోని మహిళలు ఆయనకు హారతులతో ఘనస్వాగతం పలికారు. గత ఎన్నికల సమయంలో గ్రామాన్ని వీడి వెళ్లిన టీడీపీ కుటుంబాలవారు ఇటీవల గ్రామానికి వచ్చిన వారంతా యరపతినేనిని కలువగా, తాను అండగా ఉంటానని, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషిచేయాలని ఈసందర్భంగా వారికి సూచించారు. పిన్నెల్లిలో నిర్వహించే బహిరంగసభకు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మరికొంత మంది టీడీపీ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న అరాచకపాలనకు పాతరవేసి ప్రజాస్వామ్యం, శాంతియుత, అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం పరిపాలన కొనసాగిస్తామని తెలిపారు. పిన్నెల్లి గ్రామాన్ని వైసీపీ నేతలు రావణ కాష్టంగా మార్చారన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి గ్రామాల నుంచి వారిని వెళ్లట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్క పిన్నెల్లి గ్రామంలోనే 70 కుటుంబాల వారిని ఊరువదిలి వెళ్లేలా చేశారని, మహిళలపై అత్యాచారాలు చేశారని ఆరోపించారు. నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి ధనదాహానికి 11 మంది టీడీపీ టీడీపీ కార్యకర్తలు హత్యలకు గురయ్యారని, మరో 8 మంది చిన్నారులు క్వారీ గుంతల్లో పడి చనిపోయారన్నారు. ఇక వారి ఆటలు సాగనివ్వమని అన్నారు. ఎన్నికల వరకు అన్ని గ్రామాల్లో ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బడిగుంచల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చింతపల్లి నన్నే, అమర్‌నాథ్, యామని రామారావు, యరపతినేని రమేష్, యరపతినేని మహేష్ తదితరులు పాల్గొన్నారు. దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన శబ్బా వెంకటరెడ్డి, చిటిమిరెడ్డి సుబ్బారెడ్డిలు యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరారు.

ప్రైవేటు విద్యాసంస్థల డైరెక్టర్లు, టీచర్లతో ఆత్మీయ సమావేశం

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గస్థాయి ప్రైవేటు విద్యాసంస్థల డైరెక్టర్లు, టీచర్ల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం పిడుగురాళ్లలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశానికి యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల డైరెక్టర్లు వారి సమస్యలను యరపతినేని దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం యరపతినేని మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నివ్యవస్థలతో పాటు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. విద్యాసంస్థలపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ వారికి అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేసిందన్నారు. దీంతో ఆయా యాజమాన్యాలతో పాటు విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నియోజకవర్గంలో విద్యా, ఉపాధి రంగాల్లో సుస్థిర అభివృద్ధికి తాను కృషిచేస్తానని హామీ ఇచ్చారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నడపాల్సిన పాఠశాల యాజమాన్యాలు, సిబ్బంది అభివృద్ధిని చేసే వారిని గుర్తించి ఓటు వేయాలన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావును గెలిపించుకుంటే విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో డాక్టర్ వున్నం నాగ మల్లికార్జునరావు అత్తోట రామనరసింహారావు, పీజేఎస్ ధన్, వికాస్ వెంకట్రామయ్య, జీ. శ్రీనివాసరెడ్డి, కోనేటి నరసింహారావు, అడపా శ్రీను, కృష్ణ, రవి, పోట్ల శ్రీను, శ్రీరామమూర్తి, అంబటి చంద్రశేఖర్, లక్ష్మీపతి, షేక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలలో యరపతినేని

పట్టణ టీడీపీ కార్యాలయంలో నిర్వహించినడాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో యరపతినేని పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ప్రైవేటు విద్యాసంస్థల డైరెక్టర్లు, టీచర్ల ఆత్మీయ సమావేశంలో యరపతినేని



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు



ముస్లిం, నూర్ బాషాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కన్నా, వేదికపై షరీఫ్

ముస్లింలను అంధకారంలోకి నెట్టిన వైసీపీ

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

● నియోజకవర్గ స్థాయి ముస్లిం, నూర్‌బాషాల ఆత్మీయ సమావేశం

సత్తెనపల్లి, ఏప్రిల్ 14 : వైసీపీ ప్రభుత్వం ముస్లింలను అంధకారంలోకి నెట్టిందని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. పట్టణంలోని కాకతీయ కల్యాణమండపంలో ఆదివారం నియోజకవర్గస్థాయి ముస్లిం, నూర్‌బాషాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కన్నా మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో మాటలు గారడి తప్పా ముస్లింలకు ఏ విషయంలోనూ సరైన ప్రాధాన్యం కల్పించలేదన్నారు. పైగా గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ముస్లిం సంక్షేమం సాధ్యమన్నారు. గత ఎన్నికల్లో కోడి కత్తి డ్రామా ఆడిన వైఎస్ జగన్ ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నాడన్నారు. ఎన్ని డ్రామలు చేసినా ప్రజలు జగన్‌ను నమ్మరన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింలను ఈప్రభుత్వం బానిసలుగా మార్చిందన్నారు. మైనార్టీలకు విదేశీ విద్యను దూరం చేసిందన్నారు. మైనార్టీల సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసి వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. సైకో సీఎంని సాగనంపాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి కన్నా లక్ష్మీనారాయణను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు. ముందుగా అబ్దుల్ కలాం ఆజాద్, లాల్ జాన్ బాషా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామ స్వామి, సయ్యద్ పెద కరిముల్లా, నూర్ బాషా జానీ బాబు, రాంబో బుడే, జానీ ఖాజావలి, అబ్దుల్ నబీ, సయ్యద్ మాబూ, మస్తాన్‌వలి, కిరోసిన్ సైదా, టైలర్ సైదా, జిలానీ, సత్తెనపల్లి పట్టణ నియోజక వర్గానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుల పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళి..

పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ ప్రజా వేదికలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల లువేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని వివిధ పార్టీల, సంఘాల, ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ముప్పాళ్ళ ఏప్రియల్ 14: మహిళలందరూ ఓట్లు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని తొండపిలో ఆదివారం కన్నా నాగరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. నాగరాజు మాట్లాడుతూ సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాయిడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ రాయిడి హనుమంతురావు ఉన్నారు.

సత్తెనపల్లి : పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం రాత్రి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజయాన్ని కాంక్షిస్తూ గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మేనిఫెస్టో అంశాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు.

మద్య రహిత ఎన్నికల నిర్వహణకు చర్యలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 14 : సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సెబ్ అధికారులు రానున్న ఎన్నికలు మద్య రహితంగా జరిగేలా చూడాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సెబ్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెబ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చట్ట విరుద్ధంగా మద్యం కలిగి ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సత్తెనపల్లి, క్రోసూరు, పెదకూరపాడు, సెబ్ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల గురించి సమీక్షించారు. సెబ్ నరసరావుపేట ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్, ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభం

సత్తెనపల్లి, ఏప్రిల్ 14 : సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపక శాఖ వారోత్సవాలను సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవీ సుబ్బారావు ప్రారంభించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి వివరించారు. అగ్నిప్రమాదాల్లో మృతిచెందిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ హుస్సేన్, శ్రీనివాసరావు, మోహన్ బాబు, రమణా నాయక్, ఎస్కే సుభానీ, పీఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం

రాజుపాలెం, ఏప్రిల్ 14: రానున్న ఎన్నికలలో కూటమి విజయం సాధించిన వెంటనే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు తెలిపారు. ఆదివారం మండలంలోని అనుపాలెం గ్రామంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీసీలందరూ సైకిల్‌గుర్తుపై ఓటువేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు నల్లగొర్ల నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు చిరంజీవి, మాజీ సర్పంచ్ గోగుల అంజయ్య, బాబు, అంచుల బాలసైదులు, తదితరులున్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు

మాచర్ల రూరల్ : మాచర్ల పట్టణంలోని పార్కు సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్‌పార్టీ మాచర్ల అభ్యర్థి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయపురిసౌత్: మాచర్ల మండలం కొప్పునూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి గుండాల శ్రీనివాసరావు, సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పెద వెంకయ్య తదిత రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెల్దుర్తి : వెల్దుర్తి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎస్‌హెచ్‌వో శ్రీహరి, న్యాయవాది శ్రీనివాసరావు, గంగాధరబాబు, మన్నెయ్య, కోటయ్య, పీటర్‌పాల్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రెంటచింతల : విద్యుత్ ప్రాజెక్టులోని అంబేదర్ విగ్రహానికి ఎస్ఈ వేంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ, వామపక్షాలు, గ్రామపంచాయతీ సర్పంచ్ పేర్లచౌడమ్మ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు.

కారంపూడి : కారంపూడిలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, కొమ్ము చంద్రశేఖర్, మద్రి శేషయ్య, ప్రసాద్, అక్బర్, రాంబాబు, ఏసోబు పూలమాలలువేసి నివాళులర్పించారు.

దుర్గి: మండలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముప్పాళ్ళ : ముప్పాళ్ళ ఎస్సీ కాలనీలో డీబీఆర్సీ మండల కన్వీనర్ మన్నం కోటేశ్వరరావు, న్యాయవాది గద్దల చిన్నకోటయ్యపలుదేవర్లపాడులో ఎంఆర్‌పీఎస్ నేత గుజ్జర్లపూడి అశోక్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నకరికల్లు: మండలంలోని కండ్లకుంటలో స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్, న్యాయవాది జీ కన్నారావు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నకరికల్లులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజుపాలెం : మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. రాజుపాలెం గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వున్న అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు ఆధ్వర్యంలో మండల టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు, దళిత నేతలు పూలమాలలు వేసి నివాలర్పించారు.



రెంటచింతలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రాజెక్టు ఎస్ఈ వేంకటరమణ

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు ఘననివాళులర్పించారు.

అమరావతి:అమరావతి-సత్తెనపల్లిరోడ్డు సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ విజ్ఞాన సమితి, టీడీపీ, జనసేన, బిజేపీ ఉమ్మడి కూటమి, కేవీపీఎస్ నేతలు పూలమాలలువేసి నివాళులర్పించారు. పట్నంమాలపల్లెలో టీడీపీ నాయకుడు సిహెచ్‌బాబు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

అచ్చంపేట : ఎస్‌బీఐ బ్యాంక్ ఆవరణలో డీబీఆర్సీ మండల కన్వీనర్ సందెపోగు అశోక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు, వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. మల్లెల చిన్నప్ప పాల్గొన్నారు.



రాజుపాలెంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో అంబేద్కర్ విగ్రహనికి నివాలర్పిస్తున్న టీడీపీ నేతలు

సత్తెనపల్లి రూరల్: మండలంలోని రెంటపాళ్ళ ఎస్సీ కాలనీలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు గ్రామ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో దళిత సంఘాల నేతలు, యూత్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ధూళిపాళ్ళలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

పెదకూరపాడు:పెదకూరపాడులో అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బీ రామగోపాలరావు, టీడీపీ నేతలు ఏటుకూరి బ్రహ్మయ్య, టీడీపీ దళిత నేతలు పలువురు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

కట్టిస్తానన్న 25 లక్షల ఇళ్లు ఏమయ్యాయి జగన్

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 14: పేదల ఇళ్ళ పట్టాల పేరిట మరోసారి రాజకీయం చేస్తున్న జగన్ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 25 లక్షల ఇళ్ళకు ఎన్ని పూర్తిచేశారో, ఎంతమంది లబ్ధిదారులకు వాటిని అందించారో చెప్పాలని మాజీ మంత్రి, నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. శనివారం చిలకలూరిపేట మండలం పసుమర్రులో ఎన్నికల శంఖారావం, సూపర్-6 పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదల పట్టాలు ఆపారంటూ మేమంతా సిద్ధం సభలో జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రత్తిపాటి ఖండించారు. అంతకుముందు గ్రామంలో ఇంటింటికి తిరిగి సూపర్-6 పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంచిపెట్టారు. అనంతరం కుటుంబ సాధికార సారథులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లెల రాజేష్ నాయుడు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఎన్ని నాటకాలు వేసినా ప్రజలు నమ్మరు: ప్రత్తిపాటి

జగ్గాపురం (యడ్లపాడు), ఏప్రిల్ 14: జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని నాటకాలు వేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఆరు నెలల క్రితమే జగన్‌ను వదిలించుకోవాలని రాష్ట్రంలోని 5కోట్ల మంది ప్రజలు నిర్ణయించుకున్నారని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్‌లతో కలసి యడ్లపాడు మండలం జగ్గాపురంలో ఆదివారం పర్యటించారు. ముందుగా దర్గాలో స్థానిక ముస్లిం పెద్దలతో కలసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా ఎస్టీ కాలనీకి చేరుకుని అక్కడ ఏర్పాటుచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సభలో పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో కోడికత్తి, బాబాయి హత్య డ్రామాతో రక్తికట్టించి ప్రజలను జగన్‌ను మోసం చేశారని, అదే డ్రామా ప్రస్తుత ఎన్నికల సమయంలో ఆడేందుకు సిద్ధమయ్యారన్నారు. ముఖ్యమంత్రికి భద్రత కల్పించలేని పరిస్థితుల్లో రాష్ట్ర పోలీసు వ్యవస్థ ఉందా అని ప్రశ్నించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వచ్చే ఐదేళ్ళలో పల్నాడులో సాగుకు ఇబ్బంది లేకుండా ప్రతి ఎకరాకు సాగు నీరందించేలా ప్రాజెక్టుల పూర్తికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో యువనాయకుడు సింగుఅజిత్‌కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, గ్రామపార్టీ అధ్యక్షుడు పోపూరి శ్రీనివాసరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ముద్దన నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీలు కందిమళ్ళ రఘురామారావు, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దినేడి రామకృష్ణ, ఏకలవ్య యూత్ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి గల్లంతు

బొల్లాపల్లి, ఏప్రిల్ 14: మండలంలోని పేరూరుపాడు గ్రామానికి చెందిన పత్తి శ్రీనాథ్ (19) ఒంగోలు మెయిన్ కెనాల్‌లో పడి గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పేరూరుపాడు గ్రామానికి శ్రీనాథ్ వెల్లటూరు సమీపంలో ఒంగోలు మెయిన్ కెనాల్‌లో మంచి నీరు తాగేందుకు వెళ్ళగా ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. శ్రీనాథ్ ఆచూకీ ఆదివారం రాత్రి 10 గంటలకు తెలియరాలేదు. బంధువులు, అధికారులు శ్రీనాథ్ కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.


వినోద్ కుటుంబానికి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేస్తున్న సీఐ సాంబశివరావు

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

వినుకొండటౌన్, ఏప్రిల్ 14: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఫొటోగ్రాఫర్ వినోద్ కుటుంబానికి ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సహాయనిధిని స్థానిక సీఐ సాంబశివరావు చేతులమీదుగా వినోద్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ బైక్‌పై వెళ్ళే సమయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. వినోద్‌కుటుంబానికి సొంతంగా రూ.10వేలు అందజేశారు. అదేవిధంగా ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసానుపల్లి సుబ్బారావు అందించిన మరో రూ.75వేలు కలిపి వినోద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీకాంత్‌రాయల్, శ్యామ్, మల్లికార్జున, గణేష్, వెంకటేష్, నాని, నాగూర్, బ్రహ్మయ్య, కన్నయ్య, ఇమ్మానుయేలు, నాగరాజు, రఫి గోపయ్య పాల్గొన్నారు.


అంజిబాబు మృత దేహం వద్ద నివాళులరిస్తున్న అరవిందబాబు

అంజిబాబుకు టీడీపీ నాయకుల సంతాపం

రొంపిచర్ల, ఏప్రిల్ 14: మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన లియో గ్లోబల్ ఓవర్‌సిస్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ లగడపాటి అంజిబాబు ప్రమాదవశాత్తు మరణించాడు. సమాచారం అందుకున్న నరసరావుపేట టీడీపీ ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రియాదవ్, విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల వెంకటేశ్వరరావులు ఆదివారం అంజిబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, లింగా వెంకటేశ్వర్లు, మంజుల అంజనేయులు, మామిళ్ళపల్లి ఆదిబాబు, పి.రామారావు, పి.సాంబశివరావు, గరికపాటి తాతయ్య, మోదుగుల కొండలు, వల్లెపు ఏడుకొండలు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 14: మండలంలోని పాలపాడులో ఆదివారం రాత్రి ఎనిమిది అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బీ నయనతార తెలిపారు. సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన నిందితుడు కే శ్రీను అక్రమ మద్యం కలిగి ఉండటాన్ని గమనించామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబును సత్కరిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బరాయగుప్త, కపలవాయి విజయకుమార్ తదితరులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 14: వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని పట్టాభిరామస్వామి ఆలయంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో నరసరావుపేట పట్టణ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల నాడిని పసిగట్టగలిన వాళ్ళు ఆర్యవైశ్యులని, ఇంతమంది ఆర్యవైశ్యులు టీడీపీకి మద్దతు తెలుపుతున్నారంటే తెలుగుదేశానిదే గెలుపు అన్నారు. ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశానికి 50శాతం మహిళలు కూడా వచ్చారని, వాళ్ళకు ధన్యవాదాలు తెలియజేశారు. వ్యాపారుల లావాదేవీలలో, ఆర్థికపరమైన అంశాలలో రాజకీయ జోక్యం ఉండదన్నారు. ఆర్యవైశ్యుల వ్యాపారాలలో అనవసరంగా జోక్యం చేసుకోమన్నారు. టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రెండోసారి కూడా సీటు ఇచ్చినందుకు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేశ్‌కు రుణపడి ఉన్నానని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా గెలిపించుకొనే బాధ్యత అందరిమీద ఉందన్నారు. వైసీపీ చేసే అవినీతి, అక్రమాలు, దుర్మార్గల మీద ఐదేళ్ళుగా పోరాడనన్నారు. ప్రభుత్వపరంగా, పోలీసులు ఏన్నోకేసులు పెట్టారని, అయినా భయపడింది లేదన్నారు. అందరూ జీఎస్‌టీ కడతామని, కాని నరసరావుపేటలో జే టాక్స్ పట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఏపీ స్టేట్ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ నరసరావుపేటలో గత ఐదు సంవత్సరాలుగా దోపిడీ రాజకీయం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కే రోశయ్య గతిస్తే కనీసం చూడటానికి కూడా రాలేదన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అత్యధిక శాతం టీడీపీకే మద్దతు పలుకుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా టీడీపీ. జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబును ఘనంగా సత్కరించారు. ఆత్మీయ సమావేశంలో హాజరైన ఆర్యవైశ్యనాయకులు తెలుగుదేశాన్ని గెలిపించుకొని చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, మోరబోయిన శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ, పాతనాటి రమాదేవి, డాక్టర్ చదలవాడ అమూల్యా, డాక్టర్ ఆదిత్యా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, పట్టణ అర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం

యడ్లపాడు, ఏప్రిల్ 14: మండల కేంద్రమైన యడ్లపాడు ఎస్సీ కాలనీలలో సూపర్‌సిక్స్ పథకాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలు, వాటివలన కలిగే ప్రయోజనాలను వివరించి కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వారం రోజులుగా గ్రామంలోని పలు వార్డులలో సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: లీలావతి

వనికుంట (ఈపూరు) ఏప్రిల్ 14: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమౌతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ అంజనేయులు సతీమణి శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ లీలావతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి మండలంలోని వనికుంట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలిలర్పించారు. అనంతరం ఇంటింటికి తిరిగి టీడీపీ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బాలయ్య, జగ్గారావు, బొల్లా వెంకటకోటయ్య, గ్రామ సర్పంచ్ బచ్చనబోయిన సుబ్బయ్య యోగేశ్వరరావు, నర్రా కిశోర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దానంపూడిలో 30 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

బొల్లాపల్లి, ఏప్రిల్ 14 : మండలంలోని పలుకూరు తండా గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు వినుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీలో ఆదివారం చేరాయి. వీరికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ అంజనేయులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మూగచింతలపాలెం గ్రామం నుంచి 30 కుటుంబాలు పార్టీలో చేరారు. వీరిని కూడా పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవీ అంజనేయులు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెమ్మసాని నాగేశ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.


టీడీపీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవీ

జగన్‌రెడ్డి పాలనలో అంబేద్కర్ ఆశయాలకు తూట్లు

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు


ఆర్టీసీ డిపోవద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచిన నిరంకుశ పాలకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి జీవీ అంజనేయులు నివాళులు అర్పించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం రచించడమే కాక సామాజిక ఆర్థిక వెనుకబడిన వారికి రిజర్వేషన్ కల్పించి వాళ్ళ పాలిట దేవుడైన నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తి తరతరాలకు కొనసాగించాలని యువతను ఆదేశించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజా ప్రతినిధులు, చైర్‌పర్సన్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు డైరెక్టర్, వార్డ్ ఇన్చార్జిలు, గ్రామ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, పార్టీ గృహసారథులు, కార్యకర్తలు మహిళ అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

● రొంపిచర్ల, ఏప్రిల్ 14: మండలంలోని నలగార్లపాడు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. దళిత బహుజన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూసఫ్, సతీష్, రాహూల్, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసేవారికే మద్దతు ఇవ్వాలి: లావు, ప్రత్తిపాటి

నాదెండ్ల, ఏప్రిల్ 14: మంచి ఎవరు చేస్తారనుకుంటే వచ్చే ఎన్నికల్లో వారికే మద్దతు ఇవ్వాలని నరసరావుపేట టీడీపీ ఎంపీ, చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ప్రత్తిపాటి పుల్లారావులు అన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఒక చర్చిలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున చర్చి పెద్దల కోరిక మేరకు ఇక్కడకు రావటం ఆనందంగా ఉందన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు వలేటి హిమవంతరావు, జాన్‌బాబు, పార్టీ నాయకులు తేళ్ళ సుబ్బారావు, కే అచ్చయ్య, జే శ్రీనివాసరావు, బుచ్చయ్య, పెంటాల శేషయ్య లక్ష్మీనారాయణ, జి.గగారిన్, డి.కొండయ్య, శివబాబు, హుస్సేన్, టి.శేషు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని నర్సరావుపేట రోడ్డులోని మాలమహానాడు కార్యాలయంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌలు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు తనయుడు గోనుగుంట్ల హరీష్ పాల్గొని కేక్ కట్‌చేసి అందరికి పంపిణీచేశారు. కార్యక్రమంలో మాదినేని ఆంజనేయులు, వజ్రాల కృష్ణారెడ్డి, వెంటకరెడ్డి, మక్కెన మహేష్, డీసి కొండలు తదితరులు పాల్గొన్నారు.

● అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ కార్యలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ఎంవీ నాయుడుతోపాటు కార్యదర్శి గౌస్‌మొహిద్దీన్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యలవర్తి శ్రీనివాసరావు, చీమకుర్తి బ్రహ్మం, రామకోటేశ్వరరావు, సైదారావు, సీనియర్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, యలవర్తి శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావు, మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని నర్సరావుపేట రోడ్డులోని అంబే ద్కర్ విగ్రహానికి యంయన్ ప్రసాద్, ముట్లూరి ఎలీషా, పిజె లూకా, సత్తార్, ఆచారి, వెంకటరావు, జో తదితరులు నివాళులర్పించారు.

● నర్సరావుపేట రోడ్డులోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు కోంద్రు విజయ్‌కుమార్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, పిడతల రాజా, కృపయ్య, బొందలపాటి నాగేశ్వరరావు, మల్లిఖార్జున, ఓబులేషు, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అంబేద్కర్ జిల్లా అధ్యక్షులు మారుతివరప్రసాద్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

● నరసరావుపేట రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నరసరావుపేటమండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో స్థానిక పార్టీ నాయకులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పౌరుల నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఆర్ అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్

● నాదెండ్ల, ఏప్రిల్ 14: మండలంలోని పలు గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాతులూరు టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, దావల రవి తదితరులు నివాళులర్పించారు. నాదెండ్లలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బాబు మాదిగ ఆధ్వర్యంలో క్రాంతి కుమార్, కృష్ణ మాదిగ, హర్ష, రమేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నరసరావుపేట లీగల్: స్థానిక న్యాయవాద సంఘ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ న్యాయవాద సంఘ అధ్యక్షుడు మోరా ప్రతాప్‌రెడ్డి, న్యాయవాదులు ఎం శ్రీనివాసరావు, శశికాంత్, కే విజయ కుమార్, గుండాల రవీంద్ర, కన్నారావు, అమూల్యా, అబ్బూరి ఏడుకొండలు, కే సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలో పలుచోట్ల ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో నియోజక వర్గ ఎస్సీ అధ్యక్షుడు కొండా వీరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, ఇనగంటి జగదీష్ బాబు, మద్దుమాల రవి, అడపా రాజు, జీ మాణిక్యారావు, తుపాకుల అప్పారావు, జెరీనా సుల్తానా తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సీహెచ గోవిందరావు, మునిసిపల్ సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సీహెచ్ వీరనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు మాదాసు పృద్వీరాజ్ సాయి, కే నాగేశ్వరరావు, శివ గోపీ, రాచపూడి వెంకట్ తదితరులు పాల్గొని అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బీ శ్రీను నాయక్, కుంభా నాగేశ్వరరావు, కొండ్రముట్ల నాగేశ్వరరావు, ఎన్ ఏసురాజు, ఎస్ నాగరాజు, సీహెచ్ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థి కావటి శివ నాగ మనోహర్ నాయుడు పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలూరి శ్యామ్ మోహనరావు, రవి, రామకోటేశ్వరరావు, లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమంలో ఆ పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో-కన్వీనర్ పెంటేలా బాలాజీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్దిరాలలోని జవహార్ నవోదయ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు, వైస్ ప్రిన్సిపల్ రజితాంబిక, సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● యడ్లపాడు: అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. లింగారావుపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. జగ్గాపురం, తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాల్లో జైభీమ్ సభ్యుల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.

● బొల్లాపల్లి, ఏప్రిల్ 14: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పల్నాడు ఎస్టీ సెల్ అధ్యక్షులు కోటా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో ఉసురుపాట బ్రహ్మయ్య రాష్ట్ర కోకన్వీనర్ గుండాల ఆనంద్ మాదిగ, కోట సుబ్బుమాదిగ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారులపై దాడులు

● రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తా: జీవీ

వినుకొండ, ఏప్రిల్ 14: వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారులపై దాడులు జరుగుతున్నాయని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపంచారు. స్థానిక గంగినేని కళ్యాణ మండలంలో ఏర్పాటుచేసిన వ్యాపార వర్గాల ఆత్మీయ సమావేశం మోటమర్రి వెంకటనరసింహరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ పది సంవత్సరాలుగా తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏ ఒక్క వ్యాపారిపై కక్షపూరితంగా వ్యవహరించిన దాఖలాలు లేవన్నారు. అధికారులతో దాడులు చేయించలేదన్నారు. బొల్లా పట్టణంలోని కొందరి వ్యాపారులపై కావాలనే దూషించి బెదిరించడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. రానున్న రోజుల్లో వ్యాపారులకు అండగా ఉంటామని జీవీ హామీ ఇచ్చారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్ఎస్‌పీ కాలనీ సముదాయంలో షాపు ఒకటికి 15లక్షల రూపాయలు గుడ్‌విల్ పద్ధతిపై వ్యాపారులకు కేటాయించి దోచుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. వివిధ అసోసియేషన్‌ల సూచన మేరకు అతి తక్కువ ధరకే రూ.3, 4 లక్షలకే షాపులను కేటాయిస్తామని వ్యాపారులకు హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో జిల్లాతోపాటు పట్టణంలో రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ కృష్ణదేవరాయులతోపాటు తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన వ్యాపారులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేడం రమేష్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పెండాల్య శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు నిశంకర శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు రాఘవుల తోపాటు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని పీల్చిపిప్పిచేసిన విడదల రజిని

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 14: చిలకలూరిపేట ప్రజలు నమ్మి ఓటు వేసిన పాపానికి విడదల రజిని వారిని పీల్చిపిప్పి చేసిందని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఉమ్మడి టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు దుయ్యబట్టారు. ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గాన్ని పీల్చిపిప్పి చేసి ఇప్పుడు ఎన్నికల వేళ సీటు మార్చుకొని ఆ డబ్బంతా గుంటూరులో విరజిమ్ముతున్న మంత్రికి అక్కడ పరాభవం తప్పదన్నారు. స్థానిక ప్రజల తాగునీటి కష్టాలు కూడా తీర్చని రజిని నిర్వాకానికి ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు అయోమయంలో పడ్డారన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో అడుగంటిన మునిసిపాలిటీ తాగునీటి చెరువును పరిశీలించారు. పట్టణంలో ప్రతి రోజు సరఫరా చేయాల్సిన నీటిని మూడు రోజులకొకసారి ఇస్తున్నారని, ట్యాంకర్లతో సరఫరా కూడా సరిగా లేదని, ఆ పేరుతో బిల్లులు మాత్రం దండుకుంటున్నారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ద్వారా రెండు రూపాయలకే తాగునీరు ఇస్తామంటే ప్రారంభోత్సవం చేసుకోమని చెప్పి ఆపివేసి తమపై, తమ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన చరిత్ర ఈ ప్రభుత్వందన్నారు. అధికారులు ఇకనైనా స్వేచ్ఛగా పనిచేసి తాగునీటి చెరువుకు నీటిని నింపాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. విజయవాడలో సీఎం జగన్‌పై రాయి దాడి ఘటనలో విఫలం చెందిన డీజీపీ, నిఘా చీఫ్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. ఐదుకోట్ల మంది ప్రజలంతా చంద్రబాబు, పవన్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడాలని కోరుకుంటున్నారని ప్రత్తిపాటి తెలిపారు.


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ తదితరులు

అగ్నిమాపక పరికరాల ప్రదర్శన

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 14: అగ్నిమాప వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీధర్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం విధి నిర్వహణలో మరణించిన అగ్నిమాపక శాఖ సిబ్బందికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక ప్రమాదాల నివారణపై గోడ పత్రికలు, కరపత్రాలను పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి ఎంవీ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించిన డీఎఫ్‌వో

చిలకలూరిపేట, ఏప్రిల్ 14: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలను పల్నాడు డీఎఫ్‌వో ఎస్ శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అమరులైన అగ్నిమాపక సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకొని మౌనం పాటించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. వారోత్సవాల ప్రాముఖ్యం గురించి, ప్రజలు ప్రమాదాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ సందర్భంగా ఆయన వివరించారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి ఎన్ కిరణ్‌రెడ్డి, దీపావళి మందుల షాపుల నిర్వాహకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్న ఈవీఎంలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 14: త్వరలో జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం మిషన్‌లను అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య ఆదివారం చిలకలూరిపేటకు తీసుకువచ్చారు. గణపవరంలోని సీఆర్ కళాశాలలో ఇందుకోసం స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు రెండు విడతలుగా తొలుత పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు, అనంతరం అసెంబ్లీ ఎన్నిలకు సంబంధించిన ఈవీఎంలను తరలించారు. మొత్తం 241 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 289 బ్యాలెట్, 289 కంట్రోల్ యూనిట్లను, 341 వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. చిలకలూరిపేట రిటర్నింగ్ అధికారి బీ నారదముని, ఏఈ ఆర్‌వో సీహెచ్ గోవిందరావు, మూడు మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు సీలు వేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

యడ్లపాడు, ఏప్రిల్ 14: వివాహిత మహిళ అదృశ్యమైన ఘటనలో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా కారంపూడి గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళ గత కొన్నేళ్ళుగా యడ్లపాడులో నివాసం ఉంటూ గ్రామంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది. రెండు రోజుల క్రితం ఆమె కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు వెతికి, ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదుచేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అన్నదానం, హెల్మెట్ల వితరణ

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 14: రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్త వహించాలని టీడీపీ నాయకులు, మాజీ జీడీసీసీబీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం టీడీపీ నాయకుడు మద్దిబోయిన శివ కుమారుడు, దివంగత వెంకటేష్ జయంతి సందర్భంగా మదర్ థెరిస్సా సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, హెల్మెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌కే హాస్పటల్స్ అధినేత సీహెచ్ రామకృష్ణ, ప్రముఖ ఆడిటర్ ప్రసాదు, టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, జెరీనా సుల్తానా, కౌన్సిలర్లు కొత్తకుమారి, కె.కరుణ, తోట రమేష్, జె.వినాయకరావు, ఎం.మల్లిబాబు, వెంకటేష్ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ విశ్వేశ్వర స్వామివారి కళ్యాణం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 14: స్థానిక బ్రాడీపేటలోని శ్రీ గౌరీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం పొన్నలూరి సీతారామంజనేయులు, సీతారత్నకుమారి దంపతులచే అర్చక స్వామి గౌరీ విశ్వేశ్వరశర్మ కళ్యాణం జరిపించారు.